PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 307 | విజయవాడ, గురువారం 8 జూన్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Thursday 8 June 2023 | Rs

బ్రిజ్‌భూషణ్‌పై 15 లోగా దర్యాప్తు పూర్తి

- ప్రభుత్వం హామీ
- పరిష్కరించకుంటే మళ్లీ పోరుబాటే
- తేల్చి చెప్పిన రెజ్లర్లు
- క్రీడాశాఖ మంత్రితో సుదీర్ఘ చర్చలు

7

ప్రకాశం బ్యారేజీ నుంచి నీటి విడుదల

- ముందస్తు పంటల సాగుకు రైతులు సిద్ధం కండి
- శరవేగంగా పోలవరం పనులు : అంబటి

2

సిపిఎస్ స్థానంలో జిపిఎస్

10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ • త్వరలో 12వ పిఆర్‌సి నియామకం

చిత్తూరు డెయిరీ ఆస్తులు అమూల్‌కు 99 ఏళ్లకు లీజు • రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిపిఎస్ ఉద్యోగులకు రిటైర్డు అయ్యేనాటికి వున్న బేసిక్ వేతనంలో 50 శాతం పెన్షన్‌గా చెల్లించేలా పెన్షన్ పథకాన్ని అమలు చేసేందుకు గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్) పథకానికి రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. అలాగే రాష్ట్రంలో 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తయిన సుమారు 10 వేలమంది కాంట్రాక్టు ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని ఆమోదించింది. రాష్ట్రంలో కొత్తగా 6,840 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని, ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి 12వ పిఆర్‌సిని వేయాలని, చిత్తూరు డెయిరీకి చెందిన 28.35 ఎకరాల భూమిని అమూల్ డెయిరీకి 99 సంవత్సరాలకు లీజ్‌కు ఇవ్వాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చేసిన నిర్ణయాలను రాష్ట్ర సమాచారశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ రాష్ట్ర సమాచార కమిషనరు టి విజయకుమార్‌రెడ్డితో కలిసి మీడియాకు వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డు ఉద్యోగులకు జీవన భద్రత కల్పించేలా దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సిపిఎస్‌ను రద్దుచేసి జిపిఎస్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. జిపిఎస్ దేశానికి ఆదర్శం కానుందని అన్నారు. ఈ జిపిఎస్ విధానంలో ఉద్యోగులు తమ బేసిక్‌లో 10 శాతం పెన్షన్ ఫండ్‌కు బదలాయిస్తే అంతే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం జమచేస్తుందని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రాల్లోని ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఎను 12 శాతం నుంచి 16 శాతానికి పెంచాలని తీర్మానించామని తెలిపారు. 2.73 శాతం డిఎను ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు. రాష్ట్రంలో 14,658 మంది ఉద్యోగులకు మేలు జరిగేలా వైద్యవిధాన పరిషత్‌ను రద్దు చేసి ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ విభాగంతోపాటు కొత్త మెడికల్ కాలేజీలకు సంబంధించి వైద్యారోగ్యశాఖ, ఫిషరీస్ తదితర శాఖల్లో 6,840 పోస్టులకు కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే ప్రతి మండలానికీ రెండు జూనియర్ కాలేజీలను మంజూరు చేశామని, ఇందులో ఒకటి కేవలం బాలికల కోసం కాగా, మరొక దాంట్లో కో-ఎడ్యుకేషన్ వుంటుందని తెలిపారు. 3 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపునకు నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు.

ఇందుకోసం టోఫెల్, ఇటిఎస్‌లతో అవగాహనను కుదుర్చుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో 300 మెగావాట్ల సామర్థ్యంతో విండ్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్టు చెప్పారు. ఈ నెల 12 నుంచి విద్యాకానుక పంపిణీని చేపట్టాలని, ఈ నెల 28 నుంచి వారం రోజులపాటు అమ్మఒడి పథకాన్ని అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాడు-నేడు కింద

మిగతా 2లో

మంత్రివర్గ సమావేశానికి హాజరైన సందర్భంగా రిజిష్టర్‌లో సంతకం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్

ఈ 9 నెలలు కష్టపడండి

- ఎన్నికలపై మంత్రులకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్బోధ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల ముందస్తు ఎన్నికలపై జరుగుతున్న ప్రచారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రేక్ వేశారు. బుధవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిశాక అధికారులంతా వెళ్లిపోయాక, మంత్రులతో రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ముఖ్యమంత్రి దాదాపు గంటపాటు చర్చించినట్లు తెలిసింది. రాష్ట్రంలో షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని, ఈ 9 నెలలపాటు మంత్రులంతా ప్రజాక్షేత్రంలోకి వెళ్లి గట్టిగా పనిచేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఇప్పుడు కష్టపడితే మళ్లీ గెలుపు మనదేనని ఆశాభావం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన టిడిపి మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మిని మేనిఫెస్టో, లోకేష్ పాదయాత్ర జరుగుతున్న తీరు, మూడు పార్టీల పొత్తులపై మంత్రులతో చర్చించినట్లు సమాచారం. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోను పట్టించుకోనక్కరలేదని సిఎం అన్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలతో మరింత కో-ఆర్డినేషన్‌తో వుండాలని వారికి చెప్పినట్లు సమాచారం.

కాల్పులు చోటుచేసుకున్న లక్నోలోని సిబిఐ కోర్టు పరిసర ప్రాంతాలు

యుపిలో జంగిల్ రాజ్

ముక్తార్ అన్సారీ అనుచరుడి కాల్చివేత

పట్ట పగలు కోర్టు ఆవరణలో ఘాతుకం

లక్నో : బిజెపి ఏలుబడిలో ఉన్న యుపిలో పట్ట పగలు కోర్టు అవరణలో బుధవారం ఓ నిందితుడు దారుణ హత్యకు గురయ్యాడు జైలులో ఉన్న రాజకీయ నాయకుడు ముక్తార్ అన్సారీ అనుచరుడు, ముజఫర్‌నగర్‌కు చెందిన సంజీవ్ మహేశ్వరి జీవాపై న్యాయవాది ముసుగులో వచ్చిన ఓ దుండగుడు అతి దగ్గర నుంచి కాల్పులు జరిపాడు.

ఈ ఘటనలో మహేశ్వరి అక్కడికక్కడే చనిపోగా, ఒక కానిస్టేబుల్, రెండున్నరేళ్ల బాలిక గాయపడ్డారు. ఆ చిన్నారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. బిజెపి నాయకుడు, ఎమ్మెల్యే బ్రహ్మదత్ ద్వివేది హత్య కేసులో లక్నోలోని సిబిఐ కోర్టు మహేశ్వరికి శిక్ష విధించిన కొద్ది సేపటికే ఈ ఘటన చోటుచేసుకుంది. మహేశ్వరి గ్యాంగ్‌స్టర్ అనుచరుడని, అతనిపై మొత్తం 24 కేసులు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు.కాల్పుల జరిపిన వ్యక్తి పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ కాల్పుల ఘటనపై ఆగ్రహం చెందిన లాయర్లు నిరసనకు దిగారు. పోలీసుల అండతోనే దుండగుడు ఈ దాడి చేశాడని వారు ఆరోపించారు.

ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి ఘటనలు తరుచూ జరుగుతున్నాయి. ఇటీవలే పోలీసు కస్టడీలో ఉన్న అతిక్ అహ్మద్‌ను దుండగులు కాల్చి చంపిన సంగతి తెలిసిందే. తాజా ఘటనపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. భద్రత ఎక్కువగా ఉండాల్సిన చోటే హత్యలు జరగడం ఆందోళనకరమని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ విమర్శించారు.

సిగ్నలింగ్ వైఫల్యం కాకపోవచ్చు

- ఒడిశా రైలు ప్రమాదంపై సీనియర్ సెక్షన్ ఇంజినీర్ మహంత
- అసమ్మతి నోట్ అందజేత



భువనేశ్వర్ : ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంపై ఐదుగురు సభ్యుల విచారణ కమిటీ అందజేసిన ప్రాథమిక నివేదికతో కమిటీలోని సీనియర్ సెక్షన్ ఇంజినీరు ఎకె మహంత విభేదించారు. ఈ మేరకు ఆయన తన అసమ్మతి నోట్ అందజేశారు. రైలు ప్రమాదానికి దారితీసిన కారణాలపై ప్రాథమిక విచారణ జరిపిన కమిటీ తొలుత ఏకాభిప్రాయం వ్యక్తం చేసినప్పటికీ అందులోని సభ్యుడైన మహంత ఆ తర్వాత నివేదికలోని కొన్ని అంశాలతో విభేదించారు. ఈ ప్రమాదానికి సిగ్నలింగ్ వ్యవస్థ వైఫల్యమే కారణమని కమిటీ ప్రాథమికంగా తేల్చింది. తొలుత మహంత కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవించారు. అయితే ఆ తర్వాత దానిని మార్చుకున్నారు. మిగిలిన సభ్యుల అభిప్రాయం ప్రకారం మెయిన్ లైన్ నుండి లూప్ లైన్‌లోకి వెళ్లేందుకు డ్రైవర్‌కు సిగ్నల్ ఇచ్చారు. అప్పుడు సిగ్నల్ పాయింట్ 17-ఏను రివర్స్ కండిషన్‌లో సెట్ చేశారు. దీనర్థం లూప్ లైన్‌లోకి వెళ్లాలని చెప్పడమే. దీన్ని బట్టి సిగ్నలింగ్ వ్యవస్థ వైఫల్యం కారణంగానే రైలు ప్రమాదం జరిగిందని కమిటీ తేల్చింది. అయితే లూప్‌లైన్‌లోకి వెళ్లేలా పాయింట్ (17ఏ)ను సెట్ చేశారన్న మిగిలిన సభ్యుల అభిప్రాయంతో మహంత ఏకీభవించలేదు. పాయింట్ 17ఏ రివర్స్ కండిషన్‌లో (అంటే లూప్ లైన్‌లోకి వెళ్లేలా సెట్ చేయడం) సెట్ చేసి ఉందంటే తాను అంగీకరించబోనని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు డేటా లాగర్ రికార్డును ఆధారంగా చూపారు. మెయిన్ లైన్‌కే పాయింట్‌ను సెట్ చేశారని ఈ రికార్డు చెబుతోంది. రైలు పట్టాలు తప్పిన తర్వాత అది రివర్స్‌లోకి వెళ్లి ఉండవచ్చునని మహంత తెలిపారు.

మహంత అందజేసిన అసమ్మతి నోట్ ప్రకారం రైలు లెవల్ క్రాసింగ్ గేట్ నెంబర్ 94కు చేరుకోవడానికి ముందు పట్టాలు తప్పింది. పాయింట్‌ను సెట్ చేయడానికి ముందే ఆ గేటు వస్తుంది. దీనర్థం రైలు లూప్ లైన్‌లోకి వెళ్లడానికి ముందే ప్రమాదానికి గురైంది. అసమ్మతి నోట్‌పై మహంత 3వ తేదీన సంతకం చేశారు. అయితే ప్రాథమిక విచారణ నివేదికపై కూడా ఆయన అదే రోజు సంతకం చేయడం గమనార్హం. రైలు ప్రమాదంపై సిబిఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రక్రియను చేపట్టిన సమయంలోనే మహంత అసమ్మతి నోట్ అందజేశారు. కాగా మెయిన్ లైన్‌లోకి వెళ్లాలని సిగ్నల్ పాయింట్‌ను సెట్ చేసిన తర్వాత రైలు లూప్ లైన్‌లోకి వెళ్లే అవకాశమే లేదని రైల్వే అధికారి ఒకరు స్పష్టం చేశారు. అయితే మెయిన్ లైన్‌లోకి సిగ్నల్ ఇచ్చినప్పుడు పాయింట్ లూప్ లైన్‌కు మారిన సందర్భాలు ఉన్నాయని ఆయన చెప్పారు. సిగ్నల్, రైలు కదలికలు, పట్టాలు తప్పడం వంటి విషయాలలో డాటా లాగర్ రికార్డు స్పష్టత ఇస్తుందని వివరించారు.

సిబిఐ విచారణకు 'నో'

- రైల్వే మంత్రి రాజీనామా చేయాల్సిందే
- 12 ప్రతిపక్ష పార్టీల డిమాండ్

7

కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ

రెగ్యులరైజ్ చేయాలి

- ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి • సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిపిఎస్ స్థానంలో ప్రభుత్వం జిపిఎస్‌ను తేవడాన్ని గతంలోనే అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించాయని, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌ను పక్కనపెట్టి ఉద్యోగులపై బలవంతంగా జిపిఎస్‌ను రుద్దడం సరికాదని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తయిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్న రాష్ట్ర కేబినెట్ నిర్ణయం వేలాదిమంది ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు, యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం అందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తానన్న హామీని కూడా వెంటనే అమలు చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారని, వారి సర్వీసునూ పరిగణించి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 60 వేలమంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరందరినీ సకాలంలో రెగ్యులర్ చేయకపోవడంతో కొంతమంది ఇటీవల రిటైర్ అవుతున్నారని శ్రీనివాసరావు పేర్కొన్నారు. 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి మాత్రమే రెగ్యులరైజ్ చేస్తామన్న నిబంధన సరైందికాదన్నారు.

ఈ నిబంధనతో 7 వేల నుంచి 8 వేలమంది మాత్రమే రెగ్యులర్ అవుతారని, ఎన్నికల సమయంలోనూ, మేనిఫెస్టోలో కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీకి వైసిపి ప్రభుత్వం ఇప్పుడు భిన్నంగా నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వం తక్షణమే కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా పోకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్టు, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని ప్రభుత్వానికి సూచించారు.

మాగుంట రాఘవ్‌కు మధ్యంతర బెయిల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో భాగంగా మనీ లాండరింగ్ కేసులో వైసిపి ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు మాగుంట రాఘవరెడ్డికి ఢిల్లీ హైకోర్టు 15 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అమ్మమ్మ అనారోగ్యం కారణంగా మధ్యంతర బెయిల్ కోరుతూ మాగుంట రాఘవ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను బుధవారం ఢిల్లీ హైకోర్టు వెకేషన్ బెంచ్ జస్టిస్ చంద్రధరి సింగ్ ధర్మాసనం విచారణ జరిపింది. రాఘవ తరపున సీనియర్ అడ్వకేట్ వికాస్ ఫవ్వా వాదనలు వినిపిస్తూ... 83 ఏళ్ల రాఘవ అమ్మమ్మ కాలుజారి బాత్ రూమ్‌లో పడి ఐసియులో చికిత్స పొందుతున్నారని కోర్టుకు తెలిపారు. ఆమెకు కేర్ టేకర్‌గా ఉండేందుకు రాఘవకు ఆరు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే రాఘవరెడ్డి దాఖలు చేసిన రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ ఈ నెల 26న బెంచ్ ముందుకు రానుందని వివరించారు. ఈ వాదనలపై ఇడి తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జి) ఎస్‌వి రాజు అభ్యంతరం తెలిపారు.

నిన్ హైడ్రిన్ పరీక్షకు కోర్టు అనుమతి

- వివేకా లేఖను ఢిల్లీలోని సిఎఫ్ఎస్ఎల్‌కు పంపనున్న సిబిఐ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిన ప్రాంతంలో లభించిన లేఖపై వేలిముద్రలను గుర్తించడానికి నిన్ హైడ్రిన్ ఫోరెన్సిక్ పరీక్ష నిర్వహించేందుకు సిబిఐ కోర్టు అనుమతి ఇచ్చింది. కేసు విచారణలో లేఖ అత్యంత కీలకమని, నిజాలు నిగ్గుతేల్చాలంటే ఫోరెన్సిక్ పరీక్షకు అనుమతివ్వాలని సిబిఐ కోర్టులో సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు బుధవారం ఈ నిర్ణయాన్ని వెల్లడించింది. నిన్ హైడ్రిన్ పరీక్ష కోసం లేఖను ఢిల్లీలోని సిబిఐ ఆధ్వర్యంలో పనిచేసే సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ (సిఎఫ్ఎస్ఎల్)కి పంపించనున్నారు. హత్యాస్థలిలో లభించిన ఒరిజినల్ లేఖను కోర్టుకు సమర్పించి, అవసరమైనన్ని సర్టిఫైడ్ కాపీలు తీసిపెట్టుకోవాలని సిబిఐకి కోర్టు సూచించింది. నిన్ హైడ్రిన్ పరీక్షలో ఒరిజినల్ లేఖ దెబ్బతింటే, సర్టిఫైడ్ కాపీని సాక్ష్యంగా సమర్పించాలని సిబిఐని ఆదేశించింది. వివేకా హత్య జరిగిన రోజు పోలీసులకు లభించిన లేఖలో డ్రైవర్ ప్రసాద్ హత్య చేసినట్టు రాసి ఉంది. ఆ లేఖను కడప కోర్టు ద్వారా సిబిఐ 2021లో తీసుకుంది. అదే ఏడాది ఫిబ్రవరి 11న లేఖను ఢిల్లీలోని సిఎఫ్ఎస్-ఎల్‌కు పంపింది. ఆ లేఖ వివేకా రాసిందా? కాదా? అని విశ్లేషించి నివేదిక ఇవ్వాలని కోరింది. అది వివేకా రాసిందేనని, తీవ్ర ఒత్తిడిలో రాసినట్లు ఉందని సిఎఫ్ఎస్ఎల్ తేల్చింది. ఆ లేఖను వివేకాతో బలవంతంగా రాయించినట్టు అప్రూవర్‌గా మారిన దస్తగిరి తెలపడంతో దానిపై వేలిముద్రలు గుర్తించాలని సిబిఐ నిర్ణయించింది. అందుకోసం నిన్ హైడ్రిన్ పరీక్ష నిర్వహించాల్సి ఉన్నందున సిబిఐ అధికారులు కోర్టు అనుమతి కోరారు. దీనికి నిందితులు అభ్యంతరం తెలిపినప్పటికీ నిన్ హైడ్రిన్ పరీక్షకు సిబిఐ న్యాయస్థానం అనుమతించింది.

హనుమాయమ్మ హత్యపై దర్యాప్తునకు సిట్

- నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/ ఒంగోలు క్రైం

ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం రావివారిపాలెంలో అంగన్‌వాడీ టీచర్ హనుమాయమ్మ హత్యపై దర్యాప్తునకు ప్రత్యేక బృందం (సిట్)ను ఏర్పాటు చేస్తున్నట్లు డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆమెను స్థానిక వైసిపి నేత సవలం కొండల్‌రావు ట్రాక్టరుతో ఢీకొట్టి హత్య చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. కాగా డిజిపి ఆదేశాల మేరకు ఈ కేసులో నిందితుడిగా ఉన్న కొండల్‌రావు అలియాస్ ఏడుకొండలును అరెస్టు చేసినట్లు ప్రకాశం ఎస్‌పి మలిక గర్గ్ తెలిపారు.

ఎస్‌పి కథనం ప్రకారం... ఈ నెల 5న ఉదయం 10.30 గంటల ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి హనుమాయమ్మ ఇంటికి వెళ్తుండగా ఆమెను ఏడుకొండలు ట్రాక్టరుతో ఢీకొట్టడంతో అక్కడే చనిపోయారు. ఆమె కుమార్తెపైనా దాడి చేశాడు. ఈ కేసులో ఏడుకొండలుతో పాటు సవలం మహేష్, సవలం రమణమ్మ, సవలం ఆదిలక్ష్మి నిందితులుగా ఉన్నారు. టిడిపి ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులుగా ఉన్న హనుమాయమ్మ భర్త సుధాకర్ ఎదుగదలను ఓర్వలేకనే నిందితుడు ఆ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోందని ఎస్‌పి పేర్కొన్నారు.

ఖరీఫ్‌కు అరకొర కనీస మద్దతు ధర

- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఖరీఫ్ పంటలకు కేంద్ర ప్రభుత్వం బుధవారం నాడు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)లను ప్రకటించింది. కనీస మద్దతు ధరలకు సంబంధించి స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన సి2 ప్లస్ 50 శాతం అమలు చేస్తామని తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీకి భిన్నంగా అరకొరగా ఎంఎస్‌పి ప్రకటించింది. వరికి ఎంఎస్‌పి క్వింటాలుకు రూ.143 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది, పెసర క్వింటాలుకు రూ.803 చొప్పున, రాగులు క్వింటాలుకు రూ.268 చొప్పున పెంచింది. కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలను మంత్రి పియూష్ గోయల్ మీడియాకు వివరించారు.

సాధారణ వరి క్వింటాలుకు కనీస మద్దతు ధర 2022-23లో రూ.2,040 ఉండేది. దీనిని 2023-24 కోసం రూ.2,183కు పెంచారు. అంటే రూ.143 పెరిగిందన్నమాట. గ్రేడ్ ఏ వరి క్వింటాలుకు ఎంఎస్‌పిని రూ.2,060 నుంచి రూ.143 పెంచి, రూ.2,203 చేశారు. పెసరకు ఎంఎస్‌పిని క్వింటాలుకు రూ.7,755 నుంచి రూ.8,558కి పెంచారు. హైబ్రిడ్ జొన్నలు క్వింటాలుకు ఎంఎస్‌పిని రూ.2,970 నుంచి రూ.210 పెంచి, రూ.3,180 చేశారు. రాగులు (చోళ్లు) క్వింటాలుకు రూ.3,578 నుంచి రూ.3,846కు పెంచారు. అంటే రూ.268 పెరిగింది. వేరుశనగలు (పల్లీలు) క్వింటాలుకు రూ.527 పెంచి, రూ.6,377 చేశారు. అంతకు ముందు ఏడాది రూ.5,850 ఉండేది. ప్రత్తికి రూ.6,080 నుంచి రూ.6,620కి పెంచారు. సన్ ఫ్లవర్ కి రూ.6,400 నుంచి రూ.6,760కి పెంచారు.

అలాగే కేంద్ర మంత్రివర్గం మరి కొన్ని కీలక నిర్ణయాలు కూడా చేసింది. అందులో ఒకటి "బొగ్గు, లిగ్నైట్ అన్వేషణ పథకం". ఈ స్కీమ్‌ను కొనసాగించేందుకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఐఎ) ఆమోదం తెలిపింది.

తక్కువ ఎంఎస్‌పితో రైతులకు ద్రోహం : ఎఐకెఎస్

తక్కువ ఎంఎస్‌పి ప్రకటించి రైతులకు మోడీ ప్రభుత్వం ద్రోహం చేసిందని ఎఐకెఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా విమర్శించారు. వరికి క్వింటకు సి2ం50 ప్రకారం రూ.2707.5 ప్రకటించాలని, కాని ప్రభుత్వం ఎంఎస్‌పి రూ.2,183 ప్రకటించిందని, దీనివల్ల రైతులకు రూ. 524.5 నష్టమని తెలిపారు. వేరుశెనగకు సి2ం50 ప్రకారం రూ. 7,411.5 ప్రకటించాల్సి ఉందని, కాని ప్రభుత్వం రూ.6,377 ప్రకటించిందని తెలిపారు. దీనివల్ల క్వింటాల్‌కు రైతులు రూ.1,100.5 నష్టపోతున్నారని పేర్కొన్నారు. మొక్కజొన్నకి సి2ం50 ప్రకారం రూ. 2,569.5 ప్రకటించాల్సి ఉండగా, ప్రభుత్వం రూ. 2,090 ప్రకటించిందని, దీనివల్ల రైతులకు క్వింటాల్‌కు 479.5 నష్టం జరుగుతుందని అన్నారు. పత్తికి సి2ం50 ప్రకారం రూ. 8,095.5 ప్రకటించాల్సి ఉందని, కాని ప్రభుత్వం రూ.6,620 ప్రకటించిందని, దీనివల్ల క్వింటాల్‌కు రూ.1,475.5 నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. 2022-23 ధర నిర్ణయంలో నీటిపారుదల ఖర్చులు, ఎరువుల ధరలు తదితరాల పెరుగుదలను పరిగణనలోకి తీసుకోలేదని అన్నారు. ఒక సంవత్సరం తర్వాత సి2 ఖర్చులు దీని కంటే చాలా ఎక్కువ అని తెలిపారు.

బిఎస్ఎన్ఎల్‌కు రూ. 89,047 కోట్ల ప్యాకేజీ

బిఎస్ఎన్ఎల్‌కు మూడో పునరుద్ధరణ ప్యాకేజీకి రూ. 89,047 కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఇందులో ఈక్విటి ఇన్ఫ్యూషన్ తో బిఎస్ఎన్ఎల్‌కు 4జి/5జి స్పెక్ట్రమ్ కేటాయింపు ఉంటుంది. బిఎస్ఎన్ఎల్ అధీకృత మూలధనం రూ.1,50,000 కోట్ల నుంచి రూ. 2,10,000 కోట్లకు పెరుగుతుంది.

జిపిఎస్ కాదు.. ఒపిఎస్ కావాలి

- కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి
- ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ప్రకారం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రివర్గ సమావేశంలో సిపిఎస్ స్థానంలో జిపిఎస్ అమలు చేయాలని ప్రభుత్వ నిర్ణయం రాష్ట్రంలోని 3 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో పాత పెన్షన్ విధానం అమలు చేస్తామన్న ముఖ్యమంత్రి నాలుగేళ్ల తర్వాత కొత్త స్కీమ్‌ను ప్రతిపాదించడం ప్రభుత్వ విశ్వసనీయతను దెబ్బతీసిందన్నారు. ఉద్యోగి రిటైర్‌మెంట్ నాటికి మూలవేతనంలో 50 శాతం పెన్షన్ దానిపై డియర్‌నెస్ రిలీఫ్ ఇస్తామని చేసిన ప్రతిపాదన గతం కంటే కొంత మెరుగైనప్పటికీ రిటైరైన ఉద్యోగికి పూర్తిస్థాయి భద్రతను ఇవ్వదని యుటిఎఫ్ నేతలు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలు తమ ఉద్యోగులకు పాతపెన్షన్ విధానం పునరుద్ధరించి అమలు చేస్తుంటే.. ఆయా రాష్ట్రాలు ఏమీ అమలు చేయలేదని చెప్పి ఉద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చినా.. ప్రభుత్వం నిలుపుకోలేదన్నారు. 2014 జూన్ 2 నాటికి 5 ఏళ్ల సర్వీసున్న కాంట్రాక్టు ఉద్యోగులను మాత్రమే రెగ్యులరైజ్ చేయాలని నిర్ణయించడంతో సుమారు 8 వేలమంది కాంట్రాక్టు ఉద్యోగులు నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగానికి సంబంధించి 2 వేలమంది కాంట్రాక్టు లెక్చరర్లు, సుమారు 800 మంది సిఆర్‌టిలు రెగ్యులర్ కాని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రభుత్వం మంత్రివర్గ నిర్ణయాలను పున:సమీక్షించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, రాష్ట్రంలోని మొత్తం కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని ఆందోళనలు కొనసాగిస్తామని అన్నారు.

సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ పునరుద్ధరించాలని ఐక్య ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాఫ్టో) ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్ ఫొటో)

కంటింజెంట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి - మంత్రి బొత్సకు వినతి

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలు, ప్రభుత్వశాఖలు, సంస్థల్లో 25 ఏళ్లుగా పనిచేస్తున్న టైమ్‌స్కేల్, ఫుల్‌టైమ్, కంటింజెంట్, డైలీవేజ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను విజయవాడలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయనను కలిసిన వారిలో యూనియన్ అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె భానుప్రసాద్, ప్రధాన కార్యదర్శి కెఎస్ కోటేశ్వరరావు ఉన్నారు.

జిపిఎస్ ఆమోదయోగ్యం కాదు నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

సిపిఎస్‌ను కొనసాగిస్తూ.. జిపిఎస్‌ను ఇస్తామనడం ఆమోదయోగ్యం కాదని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. గత ప్రభుత్వం వేసిన టక్కర్ కమిటీ ఇచ్చిన నివేదికను దాదాపు యథావిధిగా అమలు చేస్తూ ఉద్యోగులకు మేలు కలుగుతుందని చెప్పడం భావ్యం కాదని పేర్కొంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏదైతే హామీ ఇచ్చారో ఆ హామీని కొనసాగించి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి మంత్రి బొత్సకు ఎవి నాగేశ్వరరావు వినతి

2014 జూన్ నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, టీచర్ల జెఎసి, ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్‌లు స్వాగతిస్తున్నాయని ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, సెక్రటరీ జనరల్ ఎం బాలకాశి, కో చైర్మన్ ఇ విజయ్‌కుమార్‌రాజు, సెక్రటరీ నూర్‌మహ్మద్ పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి వినతిపత్రం సమర్పించారు. రెగ్యులరైజేషన్‌కు కటాఫ్ తేదీని 2014కు బదులు 2022 డిసెంబరు 31ని పరిగణించడం వల్ల ఎక్కువ మంది రెగ్యులరైజ్ అయ్యే అవకాశం ఉంటుందని, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలని వారు సూచించారు. 25.11.1993కు ముందు నుంచి పనిచేస్తున్న టైమ్‌స్కేలు, డైలీ వేజ్, కంటింజెంట్ క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఐదేళ్ల కాంట్రాక్టు సర్వీస్ పూర్తి చేసుకున్న వెంటనే రెగ్యులర్ అయ్యేలా చర్యలు చేపట్టాలని, రెగ్యులరేజేషన్‌లోగా రిటైర్ అవుతున్న ఉద్యోగులకు పెన్షన్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ విధానాల వల్లే విద్యారంగం కుదేలు

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వ విధానాల వల్లే విద్యారంగం కుదేలైందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. కేంద్ర ఉన్నత విద్యాశాఖ విడుదల చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ నివేదికను ప్రస్తావిస్తూ.. ఆయన బుధవారం ట్వీట్ చేశారు. నాలుగేళ్లుగా ఎపి వర్సిటీల ర్యాంకింగ్ పడిపోతున్న సంగతి ఎన్ఐఆర్ఎఫ్ నివేదికను పరిశీలిస్తే అర్థమవుతుందన్నారు. 2019లో 29వ ర్యాంకులో ఉన్న ఆంధ్రా యూనివర్సిటీ ఇప్పుడు 76వ స్థానానికి పడిపోయిందని, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ కనీసం టాప్ 100లో స్థానం పొందలేకపోవడం విచారకరమని అన్నారు. యూనివర్సిటీల్లో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయకపోవడం, వర్సిటీలను వైసిపి రాజకీయ, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు కేంద్రంగా మార్చడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు.

వడదెబ్బకు ఉపాధి కార్మికుడి మృతి

ప్రజాశక్తి- పమిడిముక్కల (కృష్ణా)

ఎండ వేడిమి తాళలేక ఉపాధి కార్మికుడు మృతి చెందిన ఘటన కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలంలో బుధవారం చోటు చేసుకుంది. తోటి కార్మికుల కథనం మేరకు.. ఐనంపూడి గ్రామానికి చెందిన ఎర్లబాల బ్రహ్మయ్య (62) రోజు మాదిరిగా ఉపాధి పనులకు వెళ్లారు. ఈ క్రమంలో పనిచేస్తుండగా ఎండ వేడిమికి తాళలేక ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయారు. కొద్దిసేపటికే మృతిచెందారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

నాటు పడవ బోల్తా

- ఇద్దరు గల్లంతు
- మరో ముగ్గురిని రక్షించిన అగ్ని మాపక సిబ్బంది

ప్రజాశక్తి -సీలేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా

సీలేరు నదిలో నాటు పడవ బోల్తాపడి ఇద్దరు గల్లంతయ్యారు. మరో ముగ్గురుని స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. ఒడిశా మల్కన్‌గిరి జిల్లా డిండిగూడ గ్రామానికి చెందిన కొందరు ఆంధ్రాలోని పడాల్‌పుట్ గ్రామంలో వివాహ కార్యక్రమానికి వచ్చారు. తిరిగి నాటు పడవపై సాజిత్ కిండిగ, బలరాం, రామ్, గోపాల్, లచ్చ తమ స్వగ్రామానికి ప్రయాణమయ్యారు. సింధు గూడ సమీపంలో వారు ప్రయాణిస్తున్న నాటు పడవ బోల్తా పడింది. గమనించిన స్థానికులు ముదిలిపొడ పోలీసులకు, ఖైర్‌పుట్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానికులతో కలిసి రామ్ , గోపాల్ , లచ్చలను రక్షించారు. సాజిత్, బలరాం గల్లంతయ్యారు. వీరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పరిమితికి మించి నాటు పడవలో ప్రయాణించడమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు.

కౌలు రైతు చట్టాన్ని సవరించాలి

- నెల్లూరులో కౌలు రైతుల రక్షణ యాత్ర ప్రారంభంలో వై.రాధాకృష్ణ
- కాకినాడ జిల్లాలో కొనసాగిన మరో యాత్ర

ప్రజాశక్తి- యంత్రాంగం

కౌలు రైతుల చట్టాన్ని మార్పు చేయాలని, కౌలు రైతులకు మేలు జరిగేలా చూడాలని డిమాండ్ చేస్తూ నెల్లూరులో బుధవారం కౌలు రైతు రక్షణ యాత్ర ప్రారంభమైంది. ఇప్పటికే అనకాపల్లి జిల్లాలో ప్రారంభమైన మరో యాత్ర కాకినాడ జిల్లాకు చేరుకుంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం గ్రామంలో యాత్రను ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. పస్తుతం ఉన్న చట్టాన్ని సవరించి, భూ యజమాని సంతకంతో పనిలేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.25 వేలు ఇవ్వాలని, భూమిలేని కౌలు రైతులకు కౌలు భరోసా ఇవ్వాలని కోరారు. దేవాలయ భూమి సాగుదారులకు సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వాలని, కనీస మద్దతు ధరపై రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించి పంటలను కొనుగోలు చేయాలని, కేరళ రాష్ట్ర ప్రభుత్వ తరహాలో రుణవిముక్తి కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. 60 ఏళ్లు నిండిన కౌలు రైతులకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని, కౌలు రైతులను ఇ-క్రాప్‌లో నమోదు చేసి ప్రభుత్వ రాయితీలన్నింటినీ కౌలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ యాత్ర ఈ నెల 12న విజయవాడ ప్రకాశం బ్యారేజ్ మీదుగా సిసిఎల్ఎ కార్యాలయానికి వెళ్లి కమిషనర్‌తో రాయబారం నిర్వహించనుందని తెలిపారు. కౌలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తొలిరోజు యాత్ర పెనుబల్లి, బుచ్చిరెడ్డిపాళెం, దామరమడుగు, ఇందుకూరుపేట, కోవూరు, యల్లాయపాళెం, కొడవలూరు, విడవలూరు ప్రాంతాల్లో సాగింది. ప్రతిచోట కౌలు రైతులు ఈ యాత్రకు స్వాగతం పలికారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యాల గురునాథం, జిల్లా ఉపాధ్యక్షులు జి.లక్ష్మీపతి, పి.చంద్రమౌళి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగలి పులయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొట్టేపాళెంలో మాట్లాడుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ

అప్పులే మిగులుతున్నాయి కాకినాడ జిల్లాలో కౌలు రైతుల ఆవేదన

అనకాపల్లి జిల్లాలో ప్రారంభమైన కౌలు రైతుల రక్షణ జీపు యాత్ర కాకినాడ జిల్లాలోని కరప, కాజులూరు మండలాల్లో బుధవారం సాగింది. ఈ యాత్రలోని నాయకులు కౌలు రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సాయమూ అందట్లేదని, ఏటా అప్పులు తప్ప ఏమీ మిగలడం లేదని పలువురు వాపోయారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ 2019 సిసిఆర్‌సి చట్టం కౌలు రైతులకు నష్టం చేసే విధంగా ఉందన్నారు. సాగు చేయని భూ యజమానులకు వరంగా మారిందని పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు రమేష్, మాజీ సర్పంచులు వనం వీరబ్రహ్మం, పెంకే సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజీ నుంచి నీటి విడుదల

- ముందస్తు పంటల సాగుకు రైతులు సిద్ధం కండి
- శరవేగంగా పోలవరం ప్రాజెక్టు పనులు : మంత్రి అంబటి

ప్రజాశక్తి- విజయవాడ

ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణా ఈస్ట్రన్ హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సాగునీటిని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా డెల్టా పరిధిలోని రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఖరీఫ్ సీజన్లో నెల రోజులు ముందుగానే 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. గత సంవత్సరం జూన్ పదిన నీటిని విడుదల చేశామని, ఈ ఏడాది మూడు రోజులు ముందుగానే సాగునీరు విడుదల చేశామని వివరించారు. దీనివల్ల ఈ ఏడాది రైతులు మూడు పంటలు పండించుకునేందుకు, తుపానులు వంటి ప్రకృతి వైపరీత్యాల బారిన పంటలు పడకుండా ఉండేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. పులిచింతల ప్రాజెక్టులో 34 టిఎంసిల నీటి నిల్వ ఉందని తెలిపారు. నీరు సమృద్ధిగా ఉండడంతో పట్టిసీమ నుండి నీటిని తీసుకొచ్చే అవసరం లేదన్నారు. నాగార్జునసాగర్ నుండి కూడా నీరు విడుదల అయ్యే అవకాశం ఉందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు తొలి దశలో అవసరమయ్యే రూ.12,911.15 కోట్లను ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించడం శుభ పరిణామమన్నారు. ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, తమ ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. కృష్ణా నదికి వచ్చే వరద నుండి విజయవాడ నగరవాసులకు రక్షణగా చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్మాణం మూడో దశ పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ గత నాలుగేళ్లగా వర్షాలు పుష్కలంగా కురిసి ప్రాజెక్టులలో నీరు సమద్ధిగా ఉండి జలకళను సంతరించుకున్నాయన్నారు. దీనివల్ల రైతులకు మేలు చేకూరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణువర్ధన్, దూలం నాగేశ్వరరావు, జనవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ సి. నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బటన్ ఆన్ చేసి నీటిని కిందకు విడుదల చేస్తున్న మంత్రి అంబటి, పక్కన మంత్రి జోగిరమేష్, కలెక్టర్ ఢిల్లీరావు

ఎల్ఐసి ఉద్యోగుల ఉద్యమ నేత రమణమూర్తి మృతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

కెవి.రమణమూర్తి (ఫైల్)

ఎల్ఐసి ఉద్యోగుల ఉద్యమ నేత కెవి.రమణమూర్తి (64) మరణించారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నగరంలోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూశారు. ప్రముఖ సినీ హాస్యనటుడు కొండవలస లక్ష్మణరావు సోదరుడు రమణమూర్తి. ఆయన మరణ వార్తతో ఎల్ఐసి ఉద్యోగులు తీవ్ర విషాదానికి గురయ్యారు. ఎల్ఐసిలో ఆయన్ని కెవిఆర్ (కొండవలస వెంకటరమణమూర్తి)గా పిలిచేవారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు శ్రీరామ్ ఉన్నారు. చావులమధుం శ్మశనవాటికలో బుధవారం సాయంత్రం కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. 1989లో ఎల్ఐసిలో ఉద్యోగంలో చేరి 2020లో ఉద్యోగ విరమణ పొందారు. ఎల్ఐసి ఉద్యోగుల యూనియన్ ఐసిఇయులో పలు బాధ్యతలు నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఎల్ఐసి పెన్షనర్స్ అసోసియేషన్‌లో సహాయ కార్యదర్శిగా సేవలు అందిస్తూ వచ్చారు. సిపిఎం, సిఐటియు ఉద్యమాలలో చురుకైన పాత్ర నిర్వహించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థి విజయానికి ఆయన ఎంతగానో కృషి చేశారు. వార్వా అక్కయ్యపాలెం జోన్ కమిటీలో క్రియాశీలంగా పనిచేశారు.

పలువురు నివాళి

కెవి.రమణమూర్తి భౌతికకాయానికి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, వార్వా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ప్రకాశరావు, బిబి.గణేష్, ప్రజా సంఘాల నాయకులు ఆర్.గణేష్‌కుమార్, బి.లక్ష్మీపతి, ఆర్ఎన్.మాధవి తదితరులు నివాళు లర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చట్టానికి లోబడే దర్యాప్తు

- మార్గదర్శి కేసులో సిఐడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్గదర్శి కేసులో చట్టానికి లోబడే దర్యాప్తు జరుగుతోందని, మార్గదర్శి యజమాన్యం విచారణకు సహకరించడం లేదని ఎపి సిఐడి అడిషనల్ ఎస్‌పి రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం అమరావతిలోని సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. మార్గదర్శి చిట్‌ఫండ్ ఖాతాదారుల ప్రయోజనాలే లక్ష్యంగా విచారణ చేస్తున్నామని అన్నారు. మార్గదర్శిలో చట్టాలు ఉల్లంఘించినట్లు ఆధారాలు దొరికాయని వివరించారు. విచారణ పేరుతో ఎవరినీ వేధించడం లేదని తెలిపారు. తమ ప్రశ్నలకు సమాధానం చెప్పడం లేదని అన్నారు.

సిపిఎస్ స్థానంలో జిపిఎస్

(మొదటిపేజీ తరువాయి)

పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నైట్ వాచ్‌మెన్ పోస్టులకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. విద్యారంగంలో మరింత పర్యవేక్షణ పెరగాలని ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ఒక డిఇఒను ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రూ.5 లక్షల లోపు ఆదాయం వున్న ఆలయాల నిర్వహణను అర్చకులే చేసుకునేలా నిర్ణయించామన్నారు. ఐదేళ్ల తర్వాత అర్చకుల నిర్వహణపై సమీక్ష చేసి కొనసాగించాలా రద్దు చేయాలా అనేలా నిబంధన తీసుకురావాలని నిర్ణయించామని అన్నారు. అలాగే దేవాదాయ భూములకు రక్షణ కల్పించేలా చట్ట సవరణకు తీర్మానించామన్నారు. ఆధార్ కార్డును చట్టబద్ధమైన గుర్తింపు కార్డుగా మార్పునకు చట్ట సవరణ చేయనున్నామన్నారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న ఎఐటియుసి జనరల్ సెక్రటరీ ఓబులేషు

'ఉక్కు' పోరాటం స్ఫూర్తిదాయం

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం కోసం విశాఖ ఉక్కు కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా మారాయని ఎఐటియుసి జనరల్ సెక్రటరీ జి.ఓబులేషు, స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 846వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌పర్నేష్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ వల్ల ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయంలో గాజువాక ప్రథమ స్థానంలో ఉందంటే స్టీల్‌ప్లాంట్ వల్లనే సాధ్యమైందని తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న ప్లాంట్‌ను కాపాడుకోవడం రాష్ట్ర ప్రజల బాధ్యత అని అన్నారు.

అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తూ 11న నిరసనలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కందుకూరు (నెల్లూరు)

ఈ నెల 11న రాష్ట్రానికి వస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసనలు తెలిపేందుకు అందరూ కలిసిరావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు కోరారు. నెల్లూరులోని సుందరయ్య భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని అమిత్ షాకు సవాల్ విసిరారు. ప్రత్యేక హోదా విషయంలో మాట తప్పారని విమర్శించారు. పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని పిలవకుండా అవమానించారన్నారు. బిజెపి పతనం కర్ణాటక ఫలితాలతో ప్రారంభమైందని తెలిపారు. బిజెపితో టిడిపి, వైసిపి అంటకాగుతున్నాయన్నారు. రామాయపట్నం పోర్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విధానం సరికాదని తెలిపారు. చేవూరు, రావూరు గ్రామాల్లో అసైన్డ్ భూముల పేరుతో నష్టపరిహారం ఇవ్వకుండా ఎగ్గొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అసైన్డ్ భూములు అమ్ముకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న చట్టంలో మతలబు దాగిందన్నారు. బడాబాబులు, భూ మాఫియాల కోసమే ఈ చట్టం తీసుకువస్తున్నారని తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్య పరిష్కారం నేటికి కాలేదన్నారు. వైసిపి వైఖరి వల్ల రాష్ట్రానికి రాజధాని ఎక్కడ అనేది ప్రశ్నార్థకంగా ఉందని తెలిపారు. సమస్యల పరిష్కారం గురించి పట్టించుకోకుండా చంద్రబాబు, జగన్ ఢిల్లీ వెళ్లి బిజెపి నేతలను కలవడం ఏమిటని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు బిజెపి శతవిధాలా ప్రయత్నిస్తోందన్నారు. సమావేశంలో సిపిఎం కందుకూరు పట్టణ కార్యదర్శి ఎస్ఎ గౌస్ పాల్గొన్నారు.



నరసరావుపేటలో జాతా నాయకులకు సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

సమాన పనికి సమాన వేతనమివాల్సిందే

- ఎన్‌టిఆర్, బాపట్ల జిల్లాల్లో కొనసాగిన జాతాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాతాలు బుధవారం 9వ రోజుకు చేరాయి. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన జాతా ఎన్‌టిఆర్ జిల్లాలోకి, సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి బయలు దేరిన జాతా ప్రకాశం మీదుగా బాపట్ల జిల్లాలోకి ప్రవేశించింది. ఎన్‌టిఆర్ జిల్లాలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేసి ఇఎస్ఐ కార్డ్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల హెల్త్ అలవెన్స్‌లు, సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తక్షణమే అమలు చేయాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నూకరాజు, రాష్ట్ర నాయకులు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతో పాటు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎందరు పాలకులు మారిన మున్సిపల్ కార్మికుల జీవితాలు మారడం లేదన్నారు. మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి 2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా జగన్మోహన్ రెడ్డి అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి అయ్యాక ఓ ఒక్క హామీనీ నెరవేర్చలేదని అన్నారు. తక్షణమే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఎపి ఎఫ్ఆర్ఎస్, ఇకెవైసి తదితర పేర్లతో కార్మికులను వేధింపులకు గురి చేయడం తగదన్నారు ఆయా మున్సిపాల్టీల్లో జాతాకు ఘన స్వాగతం లభించింది.

రాధామణికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఐవి, యుటిఎఫ్ నాయకులు

రాధామణికి కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి - యంత్రాంగం

యుటిఎఫ్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన వత్సవాయి సూర్య నారాయణ రాజు సతీమణి రాధామణికి కన్నీటి వీడ్కోలు పలికారు. జూబ్లిహిల్స్ మహాప్రస్థానంలో ఆమెకు కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. వయోభారంతో మంగళవారం ఉదయం ఆమె తన నివాసంలోనే కన్నుమూశారు. రాధామణి మృతికి పలువురు టిఎస్‌యుటిఎఫ్ నాయకులు సంతాపం ప్రకటించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని యుటిఎఫ్ హోమ్‌లో యుటిఎఫ్ నాయకులు, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ..ఉపాధ్యాయులుగా, యుటిఎఫ్ కార్యకర్తగా, రాష్ట్ర కౌన్సిలర్‌గా రాధామణి సేవలందించారన్నారు. అమలాపురంలో యుటిఎఫ్ ఎంప్లాయీస్ హోమ్‌ను తీర్చిదిద్దడంలో తన వంతు కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు కృష్ణంరాజు, టి.శ్రీరామ్మూర్తి, జిల్లా సహాధ్యక్షులు శిరోమణి, జిల్లా కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆఫీస్ బేరర్లపై ఆరా !

- అన్ని శాఖలకూ జిఎడి సర్క్యులర్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్ల పేరుతో సాధారణ బదిలీల్లో అక్రమాలు జరిగాయన్న కారణంతో మొత్తం వివరాల సేకరణలో సాధారణ పరిపాలనశాఖ నిమగ్నమైంది. అన్ని యూనియన్ల నుంచి వివరాలు సేకరించాలని నిర్దేశించింది. ఈ మేరకు అన్ని శాఖలకూ సర్క్యులర్ జారీ చేసింది. దీనికోసం ఒక నమూనాను కూడా పంపించింది. జిల్లాల్లో ఏ ఉద్యోగి తాను ఆఫీస్ బేరర్‌ను అంటూ క్లెయిమ్ చేశారు, అతను ఒక స్థానంలో ఎంతకాలం పనిచేశారు, ఏ సంఘం నుంచి సిఫార్సు లేఖ పొందారు అన్న వివరాలు సేకరించాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. గుర్తింపు పొందిన సంఘాల్లోని ఆఫీస్ బేరర్లను నిర్దిష్ట మార్గదర్శకాల మేరకు బదిలీలు చేయొద్దని గతం నుంచి ఉత్తర్వులు ఉన్నాయి. ఒకేచోట మూడు దఫాలుగా, లేదా తొమ్మిదేళ్లు నిరంతరాయంగా పనిచేస్తే మాత్రమే బదిలీ చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఆఫీస్ బేరర్లుగా లేనివారికి కూడా కొన్ని సంఘాల నుంచి సిఫార్సు లేఖలు వచ్చినట్లు గుర్తించినట్లు ప్రభుత్వం చెబుతోంది.

9న 'మధ్యాహ్న భోజన' కార్మికులకు వంటల పోటీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మధ్యాహ్న భోజన కార్మికులకు ఈ నెల 9న వంటల పోటీలు నిర్వహించనున్నట్లు మధ్యాహ్న భోజన విభాగం సంచాలకులు నిధి మీనా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే మధ్నాహ్న భోజన పథకం కార్మికులకు, రాత్రి కాపలాదారులకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యాన ఈ నెల 8న శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వంటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

చంద్రబాబు అక్రమాల వల్లే పోలవరం ఆలస్యం

- తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, విశాఖ

చంద్రబాబు అక్రమాల వల్లే పోలవరం ఆలస్యమైందని, ఈ ప్రాజెక్ట్‌ను చంద్రబాబు ఒక ఎటిఎంలా వాడుకున్నారని ఆంధ్రప్రదేశ్ తెలుగు సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి ఆరోపించారు. విశాఖలోని సిరిపురం ప్రభుత్వ అతిథి గృహంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చొరవతో పోలవం నేడు 90 శాతం పూర్తయిందన్నారు. వచ్చే ఏడాదికి ప్రాజెక్టు పూర్తవుతుందని తెలిపారు. అమిత్ షాతో చంద్రబాబు కలయిక బిజెపితో పొత్తు కోసమేనన్నారు. వాజ్‌పేయ్ కాలం నుంచి బిజెపిని చంద్రబాబు మోసం చేస్తున్నారని ఆరోపించారు. తిరుపతి వచ్చినప్పుడు అమిత్ షాపై రాళ్లు వేయించిన చంద్రబాబు బిజెపితో ఎలా పొత్తు పెట్టుకుంటారని ప్రశ్నించారు. చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇస్తే వారాహి కదులుతుందని, అంత వరకు హైదరాబాద్‌లో ఉంటుందని ఎద్దేవాచేశారు. టిడిపితో జనసేన పొత్తును ఆ పార్టీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. టిడిపి మేనిఫెస్టోలోని హామీలు మోసపూరితమని, ఆ హామీల అమలుకు ఆర్‌బిఐ వద్ద ఉన్న సొమ్ము కూడా సరిపోదని విమర్శించారు. ఈనాడు పేపర్ ముసుగులో రామోజీరావు అక్రమాలకు పాల్పడ్డారని, మార్గదర్శి చిట్స్ పేరుతో ప్రజలకు ఇవ్వాల్సిన రూ.2000 కోట్లను దారి మళ్లించారని ఆరోపించారు. అవన్నీ త్వరలో బహిర్గతమవుతాయని అన్నారు. చంద్రబాబుపై 'అల్లుడు సుద్దులు' పుస్తకం రాశానని, త్వరలో వస్తుందని తెలిపారు. లోకేష్‌ది పాదయాత్ర కాదని, ఈవెనింగ్ వాక్ అని విమర్శించారు.



నూతన వధూవరులకు పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న సిఎం జగన్

రాజోలు ఎమ్మెల్యే కుమారుని వివాహ వేడుకల్లో సిఎం జగన్

ప్రజాశక్తి - రాజోలు(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కుమారుని వివాహ వేడుకల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. మలికిపురం మండలం కత్తిమండలో రాపాక ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన కుమారుడు వెంకట్‌రామ్, శ్రీతన్మయిల వివాహం బుధవారం జరిగింది. ఈ వివాహానికి ముఖ్యమంత్రి హాజరై నూతన వధూవరులకు పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన 30 నిమిషాల పాటు స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ పటిష్టతపై ఆరా తీశారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో సన్నాహకాలు తదితర అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం ఆయన మలికిపురంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుని అక్కడి నుంచి తాడేపల్లికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మంత్రి పినిపే విశ్వరూప్, ఎంఎల్‌ఎలు పొన్నాడ వెంకటసతీష్ కుమార్, ఎంపిలు మిథున్‌రెడ్డి, చింతా అనురాధ తదితరులు పాల్గొన్నారు.

షరతుల్లేని వేతన ఒప్పందం చేయాలి

- వైజాగ్ పోర్టు వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

పోర్టుల్లో షరతులులేని వేతన ఒప్పందం వెంటనే చేయాలని పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో విశాఖ పోర్టు మెయిన్ గేటు వద్ద బుధవారం ధర్నా జరిగింది. ఈ ధర్నాలో సిఐటియు ప్రధాన కార్యదర్శి కె సత్యనారాయణ, కార్యదర్శి బి జగన్ మాట్లాడుతూ, 2022 జనవరి ఒకటి నుంచి అమలయ్యే కొత్త వేతన ఒప్పందంపై మేజర్ పోర్టుల్లో ఉన్న ఫెడరేషన్లన్నీ చార్టర్ ఆఫ్ డిమాండ్స్ ఐఎఎకి సమర్పించినట్లు తెలిపారు. ద్వైపాక్షిక వేతన సంప్రదింపుల కమిటీ (బిడబ్ల్యుయుఎన్‌సి)లో యాజమాన్యం నుంచి 13 మంది, ట్రేడ్ యూనియన్ నుంచి 13 మంది ఉండాలన్నారు. మేజర్ పోర్టులో పనిచేస్తున్న కార్మికులకు ధరల పెరుగుదలకు అనుగుణంగా నెల జీతం ఎంత ఉండాలో నిర్ణయం చేస్తారన్నారు. అటువంటి కమిటీని కాదని ఐపిఎ యాజమాన్యం ఐదుగురు సభ్యులతో సబ్ కమిటీ వేసిందని, దీనిలో కార్మికుల పక్షాన లేకుండా యాజమానులతో ఈ సబ్ కమిటీ వేయడం చట్ట వ్యతిరేకమని తెలిపారు. సబ్ కమిటీల పేరుతో అమలు కావలసిన వేతన ఒప్పందాన్ని వాయిదాలు వేస్తున్నారన్నారు. సబ్ కమిటీ క్లాజు 3, 4 కార్మిక, ఉద్యోగులకు నష్టదాయకమైన సిఫార్సులు చేస్తూ ప్రభుత్వానికి సూచించినట్లు పేర్కొన్నారు. ఇవి అమలైతే ప్రస్తుతం పొందుతున్న వేతనాలు, బేసిక్, హెచ్‌ఆర్‌ఎ, డిఎ ఏవీ పెరగవు సరికదా ప్రస్తుతం పొందుతున్నవి కూడా తగ్గే ప్రమాదం ఉందన్నారు. 2022 జనవరిలో చేయాల్సిన వేతన ఒప్పందం క్లాస్-1, క్లాస్-2 ఆఫీసర్లతో 2027లో చేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఈ సబ్ కమిటీ రాజ్యాంగ విరుద్ధమని, ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ యాక్ట్ 1947ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. మేజర్ పోర్టుల్లో ఏ పోర్టుకు ఆ పోర్టు వేతన ఒప్పందం చేసుకోవాలని కేంద్ర మంత్రి సిఫార్సు చేశారని, ఇదేనా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ దేశభక్తి అని ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాల కారణంగా మేజర్ పోర్టులు నష్టాలకు దారితీస్తున్నాయన్నారు. విశాఖపట్నం పోర్టు లాభాల్లో ఉందని తెలిపారు. దానికి దగ్గరలో గంగవరం పోర్టు పెట్టి వైజాగ్ పోర్టుకు నష్టం కలిగిస్తున్నారని విమర్శించారు. బెర్త్‌లను ప్రయివేట్ వారికి ఇవ్వడం వల్ల ఆదాయం తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రామలింగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ తిరునాథరావు, విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జె సత్యనారాయణ, నర్సింగ్, గణేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జగన్

పంటల బీమాకు కొత్త సంస్థ !

నేడు ఉన్నతాధికారుల కీలక భేటీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పంటల బీమా కోసం కొత్త బీమా సంస్థకు బాధ్యతలు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మరికొన్ని ఇతర అంశాలపైనా నిర్ణయాలు తీసుకునేందుకు గురువారం రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ భేటీ కానుంది. మొత్తం 12 అంశాలపై చర్చించనున్నారు. ఈ భేటీలోనే బీమా సంస్థపైనా చర్చకు రానున్నట్లు సమాచారం. బీమా ప్యానల్‌లో ఉన్న సంస్థల నుంచి కూడా ప్రతినిధులను భేటీకి ఆహ్వానిస్తున్నారు. ఈ భేటీలోనే బిడ్లను ఖరారు చేయనున్నారు. ప్రస్తుతమున్న బీమా సంస్థనే కొనసాగిస్తారా, కొత్త సంస్థకు బాధ్యతలు అప్పగిస్తారా అన్నది గురువారం తేలనుంది. ఎంతమంది రైతులు ఉన్నారు. వారికి అమలు చేయాల్సి వచ్చే బీమాపై అంచనాలను కూడా చర్చిస్తారు. దీనిపై అనుసరించాల్సిన నిబంధనలు, జిల్లాల వారీ క్లస్టర్లు, నష్టపరిహారం స్థాయి, అందుకు చెల్లించాల్సిన మొత్తం, బిడ్ల పరిస్థితి వంటి అంశాలను చర్చించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ సమావేశానికి ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్ (సాక్) డైరెక్టర్, ఆప్కాబ్, నాబార్డు, ఎస్‌ఎల్‌బిసి, కేంద్ర వ్యవసాయశాఖ అధికారి తదితరులు హాజరు కానున్నారు.

గొట్టా బ్యారేజీకి ముప్పు!

- వరద ప్రవాహానికి క్రమేణా దెబ్బతింటున్న అప్రాన్
- అత్యవసరంగా పనులు చేపట్టాలని నిపుణుల హెచ్చరిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లా హిరమండలం వద్ద వంశధారపై నిర్మించిన గొట్టాబ్యారేజీకి ముప్పు పొంచి ఉందని ఇంజనీరింగ్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు మరమ్మతుకు నిధుల మంజూరులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. కడప జిల్లాలో 2021 నవంబర్ 19న అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో ప్రభుత్వం... రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులు, బ్యారేజీల భద్రతపై 11 మంది సభ్యులతో ఇంజనీరింగ్, సాంకేతిక నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. గతేడాది జులై ఏడున ఈ కమిటీ బ్యారేజీని సందర్శించి పలు సూచనలు చేసింది. వరదల వల్ల దెబ్బతిన్న అప్రాన్ పనులు అత్యవసర రక్షణ చర్యలుగా పరిగణించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించింది. బ్యారేజీకి సంబంధించి అప్పటికే వంశధార అధికారులు 2021-22 రేట్లతో రూ.12.91 కోట్ల అంచనా వ్యయంతో 2021 ఫిబ్రవరిలో ప్రతిపాదనలు పంపారు. దీనిపై ఇప్పటి వరకూ ఉలుకు పలుకు లేదు. ఆగస్టులో వంశధార వరదలకు బ్యారేజీ దిగువ భాగాన ఉన్న గట్టు కోతకు గురవడంతో రూ.10 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అప్రాన్, వరద గట్ల పటిష్టానికి నిధుల కోసం అధికారులు ఎదురుచూస్తు న్నారు. హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ వద్ద 0.612 టిఎంసిల సామర్థ్యంతో 1977లో బ్యారేజీ, ఎగువ భాగంలో ఎడమవైపున 3.6 కిలోమీటర్లు, కుడివైపున 6.2 కిలోమీటర్ల మేర వరదకట్ట, బ్యారేజీకి ఆనుకుని దిగువ, ఎగువ భాగంలో 11.06 మీటర్ల వెడల్పుతో కాంక్రీట్ బ్లాకలతో అప్రాన్ నిర్మించారు. దీనికి సపోర్టుగా పెద్దపెద్ద బండరాళ్లను కట్టగా పేర్చారు. 2008, 2010 ఆగస్టులో వచ్చిన వరదల వల్ల అప్రాన్ క్రమేణా దెబ్బతింటోంది. బ్యారేజీ దిగువ భాగంలో తాత్కాలికంగా మూడు మీటర్ల మేర రాళ్లను వేశారు. బ్యారేజీ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి అధికారులు తీసుకెళ్లడంతో 2012 మార్చి 26న రూ.3.48 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 2014లో మరమ్మతులు పూర్తయ్యాయి. ఆ తర్వాత వచ్చిన వరదలకు మరోసారి బండరాళ్లు కొట్టుకుపోయాయి. 2015లో హైదరాబాద్ నుంచి సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ నుంచి వచ్చిన చీఫ్ ఇంజనీరు సర్వే చేసి, అదే ఏడాది మేలో తనిఖీ నివేదిక సమర్పించారు. బ్యారేజీ దిగువ భాగంలో అత్యవసర రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారుల ప్రతిపాదనలను పరిశీలించిన అప్పటి ప్రభుత్వం రూ.9.72 కోట్లు కేటాయిస్తూ, 2017 ఫిబ్రవరి ఏడున ఉత్తర్వులు ఇచ్చింది. అప్పట్నుంచీ పనులు చేపట్టకుండా పాలకులు నాన్చుతూ వచ్చారు. 2021-22 ధరల ప్రకారం దాని వ్యయం రూ.12.91 కోట్లకు చేరింది. ప్రస్తుత ధరలకనుగుణంగా వ్యయాన్ని లెక్కిస్తే, మరో రూ.కోటి పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

గొట్టాబ్యారేజీ వద్ద దెబ్బతిన్న అప్రాన్ (ఫైల్)

స్మార్ట్ మీటర్ల ముసుగులో రూ.17 వేల కోట్ల కుంభకోణం

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్మార్ట్ మీటర్ల ముసుగులో రూ.17 వేలకోట్ల భారీ కుంభకోణం జరిగిందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే దృష్టి పెట్టడంతోపాటు సిబిఐతో విచారణ జరిపించాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అవినాష్‌రెడ్డికి చెందిన షిరిడీసాయి ఎలక్ట్రికల్స్‌కు దోచిపెట్టేందుకు, నేరుగా ప్రజల జేబులు కొట్టేసేందుకు ప్రభుత్వం పూనుకుంటోందన్నారు. స్మార్ట్ మీటర్ల నిర్వహణ, ధరల టెండర్లను గంపగుత్తగా షిరిడీసాయి ఎలక్ట్రికల్స్, అదానీ సంస్థలకు దోచిపెట్టడంలో ఆంతర్యమేమిటని సోమిరెడ్డి ప్రశ్నించారు. రైతులు వినియోగించే విద్యుత్తు మీటర్ల కంటే స్మార్ట్ మీటర్ల ధరలే ఎక్కువగా ఉన్నాయని, టెండర్లలో రెండు సంస్థలు కోడ్ చేసిన ధరలను నిశితంగా పరిశీలిస్తే ఈ వ్యవహారంలో క్విడ్ ప్రోకో చోటుచేసుకున్నట్టు స్పష్టమవుతోందని అన్నారు.

ఉచితంగా మామిడి కాయలను పంపిణీ చేస్తున్న రైతు

ఉచితంగా మామిడి కాయలు

- మచ్చలున్న మామిడి మాకొద్దని మండీలో నిరాకరణ
- రోడ్డు పక్కన పారబోయలేక ప్రజలకు పంపిణీ

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు (చిత్తూరు జిల్లా) :

మచ్చలున్న మామిడికాయలను మండీలో కొనుగోలు చేయకపోవడంతో వాటిని ప్రజలకు ఓ రైతు ఉచితంగా అందజేశారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలంలో ఈ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు పంచాయతీ మిట్టూరు గ్రామానికి చెందిన రైతు సుమారు ఒకటిన్నర టన్నుల మామిడి కాయలను చిత్తూరులోని మండీకి తీసుకువచ్చారు. కాయలకు మచ్చలున్నాయని, ఇవి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడానికి పనికిరావని, తమకు గిట్టుబాటు కాదని, కొనుగోలు చేయబోమని వ్యాపారులు తేల్చి చెప్పారు. కష్టపడి పండించిన పంటను ఎక్కడో రోడ్డు పక్కన పారబోయడం ఇష్టం లేని రైతు గంగాధర నెల్లూరులోని ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. అప్పులు చేసి కంటికి రెప్పలా కాపాడుకున్న పంటకు గిట్టుబాటు ధర లేకపోగా కనీసం కొనుగోలు కూడా చేయడం లేదని రైతు వాపోయారు.

అనారోగ్యం, అప్పులబాధతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-వేటపాలెం (బాపట్ల జిల్లా)

అనారోగ్యం, అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన వేటపాలెం మండలం దేశాయిపేటలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... దేశాయిపేటకు చెందిన కౌతరపు జ్యోతి (47) రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె భర్త కూలి పనికి, కుమారుడు ప్రయివేటు ఉద్యోగానికి వెళ్లేవారు. జ్యోతి మోకాలి కింద రాకాసి కురుపు వచ్చింది. ఇరుగు పొరుగు వారి వద్ద అప్పులు చేసి.. రెండుసార్లు ఆపరేషన్లు చేయించుకున్నారు. అయినప్పటికీ ఆరోగ్యం ఏమాత్రమూ మెరుగుపడలేదు. భర్త, కుమారుడు తెచ్చే సంపాదనతో అప్పులు తీర్చలేకపోయింది. మరో పక్క రుణదాతలు తమ బాకీ తీర్చాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని జ్యోతి ఆత్మహత్యకు పాల్పడింది.

కేంద్ర పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ స్టిక్కర్లు

- కేంద్ర మంత్రి భారతి ప్రవీణ్ పవార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం స్టిక్కర్లు వేసుకుని తమ పథకాలుగా చెప్పుకుంటోందని కేంద్ర మంత్రి భారతి ప్రవీణ్ పవార్ అన్నారు. కేంద్రం నిధులకు కనీసం రాష్ట్ర ప్రభుత్వం ప్రొటోకాల్ కూడా పాటించడం లేదన్నారు. కేంద్ర నిధులతో చేపట్టిన కార్యక్రమాలకు కూడా కేంద్ర సహకారం ఉన్నట్లుగా ఎక్కడా ప్రస్తావించడం లేదని, ఏ రాష్ట్రంలో కూడా అక్కడ ప్రభుత్వాలు ఇలా వ్యవహరించడం లేదన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఒడిశా రైలు దుర్ఘటనపై సిబిఐ రిపోర్టు వచ్చిన తర్వాత అన్ని విషయాలు వెల్లడవుతాయన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరులో కిడ్నీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, పేద ప్రజల కోసం డయాలసిస్ యూనిట్లు అక్కడ ఏర్పాటు చేశామన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీ జాతీయ నాయకులు ఈ నెలలో పర్యటిస్తారన్నారు. బిజెపి పెద్దలను చంద్రబాబు కలవడంలో ఎటువంటి తప్పులేదన్నారు.

రాయలసీమకు పరిశ్రమలు తెస్తాం

- మైనింగ్ ప్రాంతాల్లోనే ఉద్యోగాల కల్పన
- 'మిషన్ రాయలసీమ అభివృద్ధి ప్రణాళిక' విడుదలలో నారా లోకేష్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

రాయలసీమ మైనింగ్ ప్రాంతాల్లోనే పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుని, స్థానికులకు ఉద్యోగాలొచ్చేలా చొరవ తీసుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర బుధవారానికి 119 రోజుకు చేరుకుంది. కడప శివారులోని రాజరాజేశ్వరి కల్యాణ మండపం వద్ద రాయలసీమలోని పార్లమెంటు నియోజకవర్గాల వారీగా అభివృద్ధిపై 'మిషన్ రాయలసీమ పేరుతో అభివృద్ధి ప్రణాళిక' విడుదల చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. రాయలసీమ జిల్లాల పరిసరాలకు అనుగుణంగా పెట్టుబడులను, పరిశ్రమలను పెద్దఎత్తున తెస్తామని హామీ ఇచ్చారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ, మైనింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామన్నారు. సీమలో యుద్ధప్రాతిపదికన సాగునీటి ప్రాజెక్టుల పనుల పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లాలో గుండ్రేవుల, సిద్దేశ్వరం ప్రాజెక్టుల పూర్తికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తద్వారా కర్నూలు నుంచి గుంటూరు వరకు వెళ్తున్న వలస కార్మికుల వెతలను నివారిస్తామన్నారు. రాష్ట్రంలోని భూ ఆక్రమణలపై సిట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశంలోనే రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం మూడవ స్థానం, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండవ స్థానంలో నిలవడానికి వైసిపి చేతగాని పాలనే కారణమని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో అసెంబ్లీ సీట్ల మెజార్టీనిస్తే మిషన్ రాయలసీమ అభివృద్ధి బాధ్యత తీసుకుంటానని తెలిపారు. రాయలసీమలో పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పనే 'మిషన్ రాయలసీమ అభివృద్ధి ప్రణాళిక' లక్ష్యమని ప్రకటించారు. కార్యక్రమంలో రాయలసీమలోని టిడిపి ఇన్‌ఛార్జులు పరిటాల శ్రీరామ్, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌చౌదరి, గౌరు వెంకటరెడ్డి, అమరనాథరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అమీర్‌బాబు, కస్తూరి విశ్వనాథనాయుడు, బిటెక్ రవి, విజయమ్మ, ఉక్కు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, భూపేష్‌రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నారా లోకేష్

తిరుమల కొండపై 'ముద్దు' వివాదం

ప్రజాశక్తి - తిరుమల

ప్రభాస్, కతి సనన్ కాంబినేషన్లో ఓం రౌత్ డైరక్షన్లో తెరకెక్కిన సినిమా ఆదిపురుష్ సినిమా ప్రీరిలీస్ ఈవెంట్ మంగళవారం తిరుపతిలో ఘనంగా జరిగింది. అనంతరం తిరుమలలో బసచేసిన హీరోయిన్ కృతిసనన్ మరుసటి రోజు ఉదయాన్నే బుధవారం శ్రీవారి దర్శనం చేసుకుంది. కృతితో పాటు.. డైరెక్టర్ ఓం రౌత్ ఇతర బృందం కొంత మంది దర్శనంలో పాల్గొన్నారు. అయితే దర్శనం తరువాత ఆదిపురుష్ దర్శకుడు ఓం రౌత్ చేసిన పని ఇప్పుడు వివాదాస్పదమయ్యింది. శ్రీవారి దర్శనానంతరం గుడి వెలుపల కృతికి ఓం రౌత్ సెండాఫ్ ఇచ్చాడు. ఈ క్రమంలో ఆమెకు శేష వస్త్రాలు ఒంటిపై ఉండగానే ముద్దుపెట్టి హత్తుకున్నారు. ఆ వీడియో కాస్తా సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో.. పొలిటికల్ టర్న్ తీసుకుంది. ఈ విషయంలో బిజెపి నేతలు ఘాటుగా స్పందించారు. ఓం రౌత్‌తో పాటు కతీసనన్ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. మరోవైపు ఈ విషయంలో ఆదిపురుష్ టీమ్ వాదన వేరే విధంగా ఉంది. కతి సనన్ కు ఫ్లైట్ టైమ్ అవుతోందని, కృతి సనన్ హడావుడిగా బయల్దేరేందుకు రెడీ అవ్వడంతో.. ఆమెకు సెండాఫ్ ఇచ్చే క్రమంలో డైరెక్టర్ ఇలా చేశారని.. ఇందులో తప్పుడు ఉద్దేశం కాని.. అసభ్యత కానీ లేదని అంటున్నారు.

రైలు ప్రమాద బాధితులకు వేగంగా బీమా క్లెయిమ్

- ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ వెల్లడి

ముంబయి : ఒడిస్సా రైలు ప్రమాదంలో బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలుపుతూ ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తమ క్లెయిమ్ సెటిల్మెంట్ ప్రక్రియను సడలించినట్లు తెలిపింది. ఈ పెను విషాదం వల్ల ప్రభావితమైన కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం అందించడానికి కంపెనీ తమ క్లెయిమ్ పరిష్కారాన్ని సైతం వేగవంతం చేసినట్లు పేర్కొంది. కేవలం మూడు ప్రాథమిక పత్రాల ఆధారంగా క్లెయిమ్‌లను పరిష్కరించనున్నట్లు వెల్లడించింది. బ్యాంక్ ఖాతా వివరాలు, మునిసిపల్ అధికారుల నుండి మరణ ధృవీకరణ పత్రం లేకుంటే ఆసుపత్రులు, ప్రభుత్వ అధికారులు లేదా పోలీసులు జారీ చేసిన మరణించిన ప్రయాణీకుల జాబితాను సమర్పిస్తే చాలని తెలిపింది.

మారుతి సుజుకి జిమ్నీ విడుదల

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి భారత మార్కెట్లోకి తన కొత్త ఎస్‌యువి జిమ్నీని విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను రూ.12.74 లక్షలుగా నిర్ణయించింది. ఐదు డోర్లు కలిగిన ఈ ఎస్‌యువి డెలివరీలను బుధవారం నుంచి ప్రారంభించినట్లు తెలిపింది. దీన్ని ఓల్డ్ కె15బి 1.5 లీటర్ పెట్రోల్ ఇంజన్‌తో రూపొందించగా.. లీటర్‌కు 16.94 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని వెల్లడించింది. దీన్ని అత్యాధునిక ఫీచర్లతో ఆవిష్కరించినట్లు పేర్కొంది.

రెడ్మీ బ్రాండ్ అంబాసీడర్‌గా దిశా పటాని

న్యూఢిల్లీ : షావోమి ఇండియాకు చెందిన రెడ్మీ ఆడియో, పరికరాలకు బాలీవుడ్ స్టార్ దిశా పటాని ప్రచారకర్తగా వ్యవహరించనున్నారు. త్వరలో ఆవిష్కరించనున్న రెడ్మీ బడ్స్4 ఆక్టివ్‌కు తొలి క్యాంపెయిన్ నిర్వహించనున్నారు. తమ బ్రాండ్ ఉత్పత్తులకు పాటాని ప్రచారంతో మరింత గుర్తింపు రానుందని షావోమి ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అనుజ్ శర్మ తెలిపారు.

సెన్సెక్స్ మళ్లీ 63 వేలకు చేరిక

- 2023లో తొలిసారి
- నేడు ఆర్‌బిఐ సమీక్షా నిర్ణయాల వెల్లడి

ముంబయి : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి విధాన సమీక్షాలో వడ్డీ రేట్లు యథాతథంగా ప్రకటించవచ్చనే అంచనాల్లో బుధవారం స్టాక్ మార్కెట్లకు మద్దతు లభించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, టిసిఎస్, ఇన్ఫోసిస్ షేర్ల మద్దతుతో బిఎస్‌ఇ సెనెక్స్ 350 పాయింట్లు లేదా 0.56 శాతం పెరిగి 63,143కు చేరింది. 2023లో ఈ మార్కును చేరడం తొలిసారి. ఇంతక్రితం 2022 నవంబర్‌లో 63వేల మైలురాయిని నమోదు చేసినప్పటికీ.. ఆ తర్వాత కొద్ది కాలం సూచీలు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. తాజా సెషన్‌లో ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 127 పాయింట్లు రాణించి 18,726 వద్ద ముగిసింది. మూడు రోజుల పాటు సాగుతున్న ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షా గురువారం (నేటి)తో ముగియనుంది. ద్రవ్యోల్బణం దిగొస్తున్న నేపథ్యంలో ఈ భేటీలో వడ్డీ రేట్ల పెంపు ఉండకపోవచ్చనే అంచనాలు మదుపర్లలో విశ్వాసాన్ని నింపాయని బ్రోకర్లు పేర్కొన్నారు. గత ఏప్రిల్‌లో జరిగిన సమీక్షలో వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచగా.. అంతక్రితం 2022 మే నుంచి వరుసగా రెపోరేటును 250 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. దీంతో రుణ గ్రహీతలపై అదనంగా 2.5 శాతం వడ్డీ భారం పడింది. తాజా భేటీలోనూ ఉపశమనం లభించనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. సెన్సెక్స్-30లో నెస్లే, టాటా స్టీల్, టాటా మోటార్స్ సూచీలు అధికంగా 2-3 శాతం పెరిగాయి. పవర్ గ్రిడ్, భారతీ ఎయిర్‌టెల్, ఎల్‌అండ్‌టి, ఎన్‌టిపిసి, టిసిఎస్ షేర్లు లాభపడ్డాయి.



టెక్నో పెయింట్స్ ప్రచారకర్తగా మహేశ్ బాబు

హైదరాబాద్ : టెక్నో పెయింట్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా హీరో మహేశ్ బాబు నియమితులయ్యారు. రెండేళ్లపాటు కంపెనీ ప్రచారకర్తగా ఆయన వ్యవహరిస్తారని హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపారు. "యూత్ ఐకాన్‌గా ప్రిన్స్ మహేశ్ బాబుకు ఉన్న బ్రాండ్ ఇమేజ్ కంపెనీ విస్తరణకు దోహదం చేస్తుంది. భారత పెయింట్స్ రిటైల్ రంగంలో సుస్థిర స్థానం సంపాదించాలన్న మా లక్ష్యం నెరవేరుతుందన్న ధీమా ఉంది'. అని టెక్నో పెయింట్స్‌ను ప్రమోట్ చేస్తున్న ఫార్చ్యూన్ గ్రూప్ ఫౌండర్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 22 ఏళ్ల సంస్థ ప్రస్థానంలో నాణ్యమైన రంగులు, పెయింట్స్ సర్వీస్‌తో బిజినెస్ టు బిజినెస్ (బి2బి) విభాగంలో విజయవంతం అయ్యామన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా 1,000కిపైగా ప్రాజెక్టులు పూర్తి చేశామన్నారు.

టాప్ బ్రాండ్‌గా టాటా గ్రూపు

- తర్వాత స్థానాల్లో ఇన్ఫోసిస్, ఎల్‌ఐసి
- బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌లో బ్రాండ్ విలువ పరంగా 26.38 బిలియన్ డాలర్లతో టాటా గ్రూపు అగ్రస్థానంలో ఉందని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా వెల్లడించింది. బ్రాండ్ ఫైనాన్స్ రూపొందించిన 2023 టాప్ 100 బ్రాండ్స్‌లో టాటా గ్రూపు తర్వాత స్థానాల్లో ఇన్ఫోసిస్, ఎల్‌ఐసిలు నిలిచాయి. 2022తో పోలిస్తే 2023లో టాటా గ్రూపు విలువ 10.3 శాతం పెరిగిందని బ్రాండ్ ఫైనాన్స్ డైరెక్టర్ సావియో డి సౌజ తెలిపారు. గ్లోబల్ 500 ర్యాంక్‌ల్లోనూ టాటా గ్రూపు ఒక్కటే టాప్ 100లో చోటు దక్కించుకుంది. దేశీయంగా ఇన్ఫోసిస్ 13 బిలియన్ డాలర్ల విలువతో రెండో ర్యాంక్‌లో, 9.7 బిలియన్ డాలర్లతో ఎల్‌ఐసి సంస్థ మూడో స్థానంలో నిలిచింది.

60 నెలల ఇఎంఐతోనూ అథర్ ఎనర్జీ వాహనాలు

న్యూఢిల్లీ : తమ సంస్థ వాహనాలను 60 నెలల రుణ వాయిదాలతోనూ పొందవచ్చని ద్విచక్ర విద్యుత్ స్కూటర్ల తయారీదారు ఏథర్ పేర్కొంది. ఇవి స్కూటర్లను మరింత సరసమైనవిగా, సులభంగా పొందడానికి ఇది దోహదం చేస్తుందని తెలిపింది. తమ నిర్ణయంతో రూ.2,999 నెల వాయిదాతోనే అథర్ ఎనర్జీ వాహనాలు పొందవచ్చని ఆ సంస్థ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రవ్‌నీత్ ఎస్ ఫోకేలా పేర్కొన్నారు. సాధారణంగా విద్యుత్ వాహనాలపై 36 నెలలు లేదా ప్రత్యే పరిస్థితుల్లో 48 నెలల కంటే ఎక్కువ కాలావధి ఇవ్వడానికి వెనుకంజ వేస్తాయి.

ATHER

సంపాదకీయం

పోలవరం గందరగోళం

ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా చెప్పబడుతున్న ప్రతిష్టాత్మక పోలవరం కథ మరోమారు గందరగోళంలో పడింది. అందుకు కారణమైంది మళ్లీ కేంద్ర బిజెపి ప్రభుత్వమే. ప్రాజెక్టులో 41.15 మీటర్ల ఎత్తులో నీరు నింపడానికి ఇంకా ఎన్ని నిధులు కావాలో అంచనా వేసిన కేంద్ర ఆర్థికశాఖ రూ.12,911 కోట్ల విడుదలకు సోమవారం మెమో జారీ చేసి, ఈ నోట్‌ను జలశక్తి మంత్రి మండలిలో ఆమోదింపజేసుకోవాలంది. ఆ మరుసటి రోజునే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పోలవరాన్ని సందర్శించి అక్కడే అధికారులతో సమీక్ష జరిపి ప్రాజెక్టు తొలిదశ పూర్తికి కేంద్రం నిధులిస్తున్నందున ఇక సమస్య ఉండదని, నిర్మాణ పనులను పరుగులు పెట్టించాలని ఆదేశించారు. అన్నీ అనుకూలిస్తే 2025 జూన్‌కు ప్రాజెక్టు పూర్తవుతుందని అధికారులు తెలపగా, అంతకంటే ముందు ఎందుకు పూర్తి చేయలేమని సిఎం ప్రశ్నించారు. గడువుల సంగతెలా ఉన్నప్పటికీ రాష్ట్ర పునర్వ్యస్థీకరణ చట్టం ద్వారా జాతీయ ప్రాజెక్టు హోదా సంతరించుకున్న పోలవరం విషయంలో కేంద్రానిది వంచనల మీద వంచన. ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తారన్న ప్రచారానికి కేంద్రం చర్యలు బలం చేకూర్చేలా ఉన్నాయి. 41.15 మీటర్ల ఎత్తులో నీరు నిలపడం అనేది ప్రాజెక్టు నిర్మాణంలో తొలిదశ అని స్పష్టత ఇవ్వలేదు.

తొలి నుంచీ పోలవరం ప్రాజెక్టులో అన్యాయానికి, వివక్షకు గురవుతున్నది భూములు, ఊళ్లు, ఇళ్లు, సర్వం కోల్పోతున్న లక్షలాది మంది నిర్వాసితులు. నిర్వాసితుల్లో సింహభాగం గిరిజనులే. నిర్వాసితులకు సహాయ పునరావాసం తన భాధ్యత కాదని తరచు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. భూముల్లేకుండా ప్రాజెక్టులు గాలిలో కడతారేమో కేంద్రమే చెప్పాలి. తాజాగా పోలవరం నిధులపై కేంద్రం జారీ చేసిన మెమోలో ఎక్కడా నిర్వాసితుల పునరావాసం ప్రస్తావన లేదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన లైడర్ సర్వే ప్రకారం 41.15 మీటర్ల ఎత్తులో నీరు నిలపాలంటే అదనంగా 36 గ్రామాల్లోని 16,642 కుటుంబాలను తరలించాలి. వారి పునరావాసానికి నిధులేవి? నిర్వాసితుల బాధ్యత తనది కాదని కేంద్రం మరొకసారి చెప్పకనే చెప్పింది. ముఖ్యమంత్రి మాత్రం నిర్వాసితులకు షెడ్యూల్ ప్రకారం పునరావాస కాలనీలు నిర్మించాలని, వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు మినహా కేంద్రం దుర్మార్గంపై దాటవేశారు. ఎన్నికల సమయంలో రూ.10 లక్షల ప్యాకేజీ ఇస్తామన్న హామీపై సి.ఎం. స్పష్టత ఇవ్వలేదు. 18 ఏళ్లు నిండిన వారందరికీ ప్యాకేజీ అమలు చేయాలన్న డిమాండ్‌పై స్పందించలేదు. అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం రెండూ కూడబలుక్కొని ప్రాజెక్టు నిర్మాణానికి తమ సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులను అనాథలు చేయడం క్షమించరానిది. ఈ మోసపూరిత చర్యలను ప్రజలు ప్రతిఘటించడమే మార్గం.

పోలవరం నిర్మాణ అంచనా 2010-11లో రూ.16 వేల కోట్లు. 2013-14 కొచ్చేసరికి 20 వేల కోట్లు. 2017-18లో జలమండలి సాంకేతిక సలహా కమిటీ రూ.55 వేల కోట్లకు ఓకే చేసింది. కేంద్ర రివైజ్డ్ కాస్ట్ కమిటీ 47 వేల కోట్లకు అంచనాలు కుదించింది. ఎవరు ఏ అంచనా వేసినా నిర్వాసితులైన 1.06 లక్షల కుటుంబాల సహాయ పునరావాసానికి రూ.30 వేల కోట్లవుతుందని తేల్చారు. ఆ నిధులు కేంద్రమే ఇవ్వాలి. ఇప్పటికీ కేంద్రం ఆ ఊసెత్తట్లేదు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని గట్టిగా అడగట్లేదు. వీరి దోబూచులాటలో నిర్వాసితులు బలవుతున్నారు. వర్షాకాలం వచ్చేసింది. గోదావరికి వరదొస్తే నిర్వాసితుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. గతంలో వచ్చిన చిన్న వరదలకే ఇళ్లు, ఊళ్లే కాదు పునరావాస కాలనీలూ మునిగాయి. కాంటూరు లెక్కల్లో అశాస్త్రీయత వలన అంచనాల కంటే ఎన్నో రెట్ల ముంపు సంభవిస్తోంది. ఈ నేపథ్యంలో దశలవారీ నిర్వాసితుల తరలింపునకు ప్రాతిపదిక ఉండదు. ప్రాజెక్టు నిర్మాణానికంటే ముందు నిర్వాసితులకు చట్టాలను, ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు నెరవేర్చాలి. పాలకులు ఇంకే మాటలు చెప్పినా అవి నీటి మీద రాతలే! ప్రాజెక్టు నిర్మాణానికి డెడ్‌లైన్లు పెడుతూ నిర్వాసితులను గాలికొదిలేసే చర్యలు విడనాడాలి.

మహనీయుని మాట

చదువు సంధ్యలు సామాన్య ప్రజల్లోకి ఎంతగా చొచ్చుకొని పోతాయో అంతగా ఆ దేశం అభివృద్ధి చెందుతుంది.
- స్వామి వివేకానంద



కార్పొరేట్ల కబ్జాలో ఇంటర్ విద్య

విశ్లేషణ

వి. రాంభూపాల్

ఇంటర్ విద్యా వ్యాపారం మూడు పువ్వులు పదహారు కాయలుగా విలసిల్లుతున్నది. దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆరు నుండి పది లక్షల కోట్ల రూపాయల విద్యా వ్యాపారం జరుగుతుండగా, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో లక్షన్నర కోట్ల రూపాయల కార్పొరేట్ విద్యా వ్యాపారం వర్ధిల్లుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేట్ విద్యాసంస్థల ఇంటర్ వ్యాపారం ప్రతి సంవత్సరం 12 శాతం వృద్ధితో ఇతర అన్ని రంగాల కంటే వేగంగా విస్తరిస్తున్నది. విద్య అనే ఖరీదైన సరుకును కొనలేక పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక కష్టాల్లో, మానసిక ఆందోళనల్లో కూరుకుపోతున్నాయి. ప్రభుత్వ రంగంలో ఉపాధి అవకాశాలు అడుగంటడం, వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం, వృత్తులు క్షీణించడం, మాల్స్ పోటీకి చిన్న, మధ్యతరహా వ్యాపారాలు మూతపడడం, మధ్యతరగతి ప్రజల ఆశలు, ఆకాంక్షలు, ఆందోళనలు, కార్పొరేట్ విద్యాలయాల వ్యాపార ప్రకటనలు కలిపి విద్యా వ్యాపారానికి బలమైన పునాదులు వేశాయి. ఈ పునాదులపై నిర్మిస్తున్న విద్య ఖరీదైన సరుకుగా మారింది. ఆ సరుకును కొనడం భవిష్యత్ తప్పనిసరి అవసరంగా మార్చేశారు. ఈ పరిస్థితి కార్పొరేట్ విద్యాసంస్థలకు వరంగా...పేద, మధ్యతరగతి ప్రజలకు శాపంగా... విద్యార్థులకు యమపాశంగా తయారయింది.

కార్పొరేట్ కబ్జాకు బలైన ఇంటర్ విద్య

2022లో దేశవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలు రూ. 6.58 లక్షల కోట్ల రూపాయల విద్యావ్యాపారం జరిగింది. అందులో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రూ. లక్ష 12 వేల కోట్ల విద్యా వ్యాపారం జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 78 శాతం ఇంటర్మీడియట్ విద్యదే కావడం తీవ్ర ఆందోళనకరం. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం విద్యార్థులు సుమారు 29.50 లక్షల మంది వుండగా, అందులో 15.35 లక్షల మంది విద్యార్థులు కార్పొరేట్ సంస్థల్లో చదువుతున్నారు. గుర్తింపులేని ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య కలిపితే 60 నుండి 72 శాతం వుంటుంది. ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రభుత్వ కాలేజీలు 439, ఎయిడెడ్ 131 (వీటిని మూత వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ప్రయత్నం చేసింది.) వుండగా, ప్రైవేట్ కాలేజీలు మాత్రం 1550 పైగా ఉన్నాయి. మరోవైపు ప్రభుత్వ కళాశాలల్లో గత 10-15 సంవత్సరాలుగా ఏ విధమైన నియామకాలు జరగలేదు. ఉన్న లెక్చరర్లను పిల్లల సంఖ్య సాకుతో ఇతర కళాశాలలకు పంపించివేసి కొన్ని కాలేజీలను శాశ్వతంగా మూసివేశారు. విశాలమైన కళాశాలలు, సమర్థులైన అధ్యాపకులు, ల్యాబ్‌లు, ఆటస్థలాలు, సామాజిక, రాజకీయ చైతన్య కేంద్రాలుగా నాడు విలసిల్లిన ఇంటర్ కళాశాలలు నేడు పాడుబడిన బూత్ బంగ్లాల్లాగా మారుతున్నాయి. గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వాలు కుట్రపూరితంగా ప్రభుత్వ ఇంటర్ విద్యను నాశనం చేసి, కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించాయి. ఈ సంస్థల్లో లాభపడిన వారు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, కార్పొరేట్ ఆసుపత్రుల నిర్వహణ, వివిధ వ్యాపారాల్లో భాగస్వాములుగా వుండడమే కాక కొందరు రాజకీయాల్లోకి జొరబడ్డారు. మరికొందరు అధికార పార్టీలతో సర్దుబాటు చేసుకుంటూ తమ వ్యాపారానికి అడ్డులేకుండా చేసుకుంటున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కొత్తలో వైసిపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలపై ముఖ్యంగా నారాయణ విద్యా సంస్థలపై చేసిన హడావుడిలో రాజకీయ కోణమే తప్ప విద్యా ప్రైవేటీకరణను అడ్డుకోవాలనే చిత్తశుద్ధి లేనట్లు అనుభవం చెబుతున్నది.



> ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రభుత్వ కాలేజీలు 439, ఎయిడెడ్ 131 (వీటిని మూత వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ప్రయత్నం చేసింది.) వుండగా, ప్రైవేట్ కాలేజీలు మాత్రం 1550 పైగా ఉన్నాయి. మరోవైపు ప్రభుత్వ కళాశాలల్లో గత 10-15 సంవత్సరాలుగా ఏ విధమైన నియామకాలు జరగలేదు. ఉన్న లెక్చరర్లను పిల్లల సంఖ్య సాకుతో ఇతర కళాశాలలకు పంపించివేసి కొన్ని కాలేజీలను శాశ్వతంగా మూసివేశారు.

ఫీజులను నియంత్రించలేని ప్రభుత్వ జీవోలు

ఆంధ్రప్రదేశ్‌లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఆర్. కాంతారావు చైర్మన్‌గా విద్యారంగ నిపుణులతో 2021లో పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ వేసింది. ఈ కమిషన్ సిఫారసుల మేరకు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 2021-22, 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలకు ఫీజులు నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 53, 54 విడుదల చేసింది. గ్రామ పంచాయితీల్లో అయితే నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు రూ. 10 వేలు, పట్టణాల్లో రూ. 11 వేలు, నగరాల్లో రూ. 12 వేలు వసూలు చేయాలి. ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు గ్రామాల్లో రూ.12 వేలు, పట్టణాల్లో రూ. 15 వేలు, నగరాల్లో రూ. 18 వేల ఫీజు నిర్ణయించారు. అలాగే ఇంటర్మీడియట్ మ్యాథ్స్, సైన్స్ గ్రూపులకు గ్రామాల్లో రూ. 15 వేలు, పట్టణాల్లో రూ. 17.5 వేలు, నగరాల్లో రూ. 20 వేల వరకు వసూలు చేసుకోవాలి. ఫీజుల బోర్డులు, తల్లిదండ్రుల కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కాని ఆచరణలో ఒక్కటీ అమలు కావడంలేదు. కార్పొరేట్ విద్యాలయాలు పట్టణాల్లో నర్సరీ చదువుకే రూ. 6 నుండి రూ. 10 వేలు, ఒకటో తరగతికి రూ. 6,500 నుండి రూ. 11 వేలు, ఇంటర్మీడియట్ మ్యాథ్స్, సైన్స్ గ్రూపుల్లో డే స్కాలర్లకు రూ. 60 వేల నుండి రూ. లక్ష, హాస్టల్ విద్యార్థులకు రూ. లక్షన్నర నుండి రూ. రెండు లక్షలకు పైగా ఫీజులు వసూలు చేసుకుంటున్నారు. పుస్తకాలు, బట్టలు...ఇలా ఎన్ని రూపాల్లో వీలైతే అన్ని రూపాల్లో తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఆకర్షణీయమైన కోర్సుల కోచింగ్ పేరుతో ప్రతి సంవత్సరం భారీగా ఫీజులు పెంచుకుంటున్నాయి. ఫీజుల నియంత్రణ మీద మొదట్లో హడావుడి చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా నూతన విద్యావిధానాన్ని దేశంలో అందరికంటే ముందుగా అమలు చేసి కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని మరింతగా ప్రోత్సహించే విధానాలను అమలు చేస్తున్నది.

కార్పొరేట్ ప్రచార గారడీ

లేనిది ఉన్నట్లు, వున్నది లేనట్లు చేసేదానిని గారడి విద్య అంటాము. మార్కులు, ర్యాంకుల పేరుతో గారడీ ప్రచారం చేసి తమ సంస్థల్లో చేర్చుకోవడానికి నారాయణ, చైతన్య లాంటి కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రతి సంవత్సరం కోట్ల రూపాయలు ప్రచారం కోసం ఖర్చు చేస్తున్నాయి. మార్కులు, ర్యాంకులన్నీ వీరి కళాశాల గ్రౌండ్‌లో పండుతున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ప్రభుత్వం మార్కులు, ర్యాంకులను నిషేధించిన గ్రేడ్ల పేరుతో ప్రచారం కొనసాగుతూనే వుంది. ఈ ప్రచార మాయాజాలంలో తల్లిదండ్రులు బలైపోతున్నారు. కార్పొరేట్ సంస్థలలో చదివితే నీట్, జెఇఇ లలో ర్యాంకులు పొంది ఐఐటి, ఐఐఎం లాంటి ఉన్నత విద్యాలయాల్లో సీట్లు వస్తాయని, దేశంలో, విదేశాల్లో మంచి ఉద్యోగాలు వస్తాయనే భ్రమ మధ్యతరగతి ప్రజల్లో కల్పించడంలో ఈ విద్యాసంస్థలు జయప్రదం అయ్యాయి. కార్పొరేట్ విద్యాలయాలలో చదవకపోతే చదువు రాదని, పిల్లలకు భవిష్యత్ వుండదనే భయాన్ని తల్లిదండ్రుల్లో ఈ విద్యాసంస్థలు సృష్టించగలిగాయి. తమ ఆర్థికశక్తితో సంబంధం లేకుండా విద్యను కొనేందుకు దిగువ మధ్యతరగతి కుటుంబాలు పోటీలు పడి అప్పుల వలయంలో చిక్కుకుంటున్నాయి. కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న వాస్తవ విషయాలను తల్లిదండ్రులు గుర్తించకుండా చేయగలుగుతున్నారు. 2022 సంవత్సరంలో సుమారు 17 లక్షల మంది విద్యార్థులు నీట్ ప్రవేశ పరీక్షలు రాయగా 9,93,069 విద్యార్థులు మాత్రమే సీటు పొందేందుకు అర్హత సంపాదించారు. అలాగే జెఇఇ సీటు కోసం 1,55,538 మంది పరీక్షలు రాయగా 40,712 మంది విద్యార్థులు మాత్రమే అర్హత సాధించారు. దేశంలో 70 లక్షల మంది విద్యార్థులు ప్రతి సంవత్సరం ప్రైవేట్ కోచింగ్ తీసుకుంటున్నట్లు నేషనల్ శ్యాంపిల్ సర్వే అంచనా వేసింది.

ఇంటర్‌లో ప్రవేశ పరీక్షల ప్రత్యేక కోచింగ్‌ల పేరుతో పిల్లలపై మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులపై ఆర్థిక ఒత్తిడి పెంచిన తర్వాత కూడా ఎందుకు అర్హత సాధించలేకపోతున్నారు? కార్పొరేట్ విద్యాలయాల్లో ఇంటర్‌లో చేరిన వారి సంఖ్య ఎంత? పాస్ అవుతున్న వారి సంఖ్య ఎంత? ఇంటర్ తర్వాత ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో రూ.లక్షలు కట్టి సీట్లు కొంటున్న స్థితి చూస్తూనే వున్నాము. ఈ సంవత్సరం బిటెక్ సిఎస్‌ఇ కోర్సుల్లో చేరడానికి కనీసం రూ. నాలుగు లక్షల నుండి రూ. ఆరు లక్షల ఫీజు వసూలు చేస్తున్నారు. కాలేజి బ్రాండ్‌ను బట్టి ఈ ఫీజు మరింత ఎక్కువగా వుంటుంది. డొనేషన్, హాస్టల్ ఫీజుల పేరుతో మరిన్ని రూ. లక్షలు లాగేస్తున్నారు. నయా ఉదారవాద విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత సామాజిక శాస్త్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ఇంటర్ చదువంటే ఎంపిసి, బైపిసి అనే పరిస్థితి ఏర్పడింది. ఇంజనీరింగ్ కాలేజీలలో కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో కంప్యూటర్ సైన్స్‌ల డిమాండ్‌ను పెంచడంతో కోర్ సబ్జెక్టులు ముఖ్యంగా సివిల్ ఇంజనీరింగ్ లాంటి విభాగాలు మూతపడుతున్నాయి. మరోవైపు ఉద్యోగ నియామకాలు ప్రతి సంవత్సరం భారీగా తగ్గిపోతున్నాయి. 2020-21లో 13,86,721 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు చదివితే 3,73,363 మంది మాత్రమే ప్లేస్‌మెంట్ పొందారు. విద్య విజ్ఞానం కోసం అన్న స్థానంలో విద్య ఉపాధి కోసం అనే విధంగా కార్పొరేట్ సంస్థలు మార్చాయి. ఇంటర్ దశలో పెట్టుబడితే ఆ తర్వాత ఆదాయం ఇబ్బడి ముబ్బడిగా వచ్చేస్తున్నట్లు ఆశ కలిపిస్తున్నాయి.

> లక్షల రూపాయలు కట్టలేని సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల పిల్లల భవిష్యత్ గురించి పాలకులు ఆలోచించడంలేదు. చదువుల కొనుగోలులో మధ్యలోనే ఆగిపోతున్న యువత ఏమౌతున్నదో వారికి పట్టడంలేదు. చిన్న వయసు నుండే తల్లిదండ్రులకు దూరంగా పొందే విద్య మార్కుల జ్ఞానాన్ని ఇస్తుందేమో గాని, సామాజిక జ్ఞానాన్ని ఇచ్చే అవకాశం తక్కువ. పిల్లల భవిష్యత్ వికాసాన్ని, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని సంక్షోభంలోకి నెడుతున్న కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని అడ్డుకోవాలి. అందరికీ ప్రభుత్వ విద్య రాజకీయ ప్రధాన ఎజెండాగా మారాలి.

కార్పొరేట్ విద్య దుష్ఫలితాలు

మార్కులు తప్ప వేరే ప్రపంచం తెలియని నిర్బంధ జైళ్లు కార్పొరేట్ విద్యాసంస్థలు. విద్యార్థుల స్థాయి, కుటుంబ నేపథ్యంతో సంబంధం లేకుండా బట్టీ పెట్టే విధానం అమలు చేస్తున్నారు. 14 నుండి 16 గంటల వరకు చదివించడం తమ గొప్ప అయినట్లు ఈ సంస్థలు చెప్పుకుంటున్నాయి. తమ సంస్థల పేరుప్రఖ్యాతుల కోసం అడ్డదారులు తొక్కి పేపర్ లీకేజీలకు పాల్పడుతున్నారు. క్రీడలు, విజ్ఞాన చర్చలు, వినోదం లాంటివి విద్యార్థులకు అందుబాటులో వుండడంలేదు. దీనివల్ల వారు మానసికంగా కుంగిపోతున్నారు. కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణకు దూరమవుతున్న పిల్లలు కాలేజీలలో ప్రవర్తిస్తున్న తీరు, డ్రగ్స్ లాంటి వాటికి అలవాటు పడుతున్న ఘటనలు ఆందోళన పరుస్తున్నాయి. లక్షల రూపాయలు కట్టలేని సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల పిల్లల భవిష్యత్ గురించి పాలకులు ఆలోచించడంలేదు. చదువుల కొనుగోలులో మధ్యలోనే ఆగిపోతున్న యువత ఏమౌతున్నదో వారికి పట్టడంలేదు. చిన్న వయసు నుండే తల్లిదండ్రులకు దూరంగా పొందే విద్య మార్కుల జ్ఞానాన్ని ఇస్తుందేమో గాని, సామాజిక జ్ఞానాన్ని ఇచ్చే అవకాశం తక్కువ. పిల్లల భవిష్యత్ వికాసాన్ని, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని సంక్షోభంలోకి నెడుతున్న కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని అడ్డుకోవాలి. అందరికీ ప్రభుత్వ విద్య రాజకీయ ప్రధాన ఎజెండాగా మారాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు /

జనవాక్యం

న్యాయం కోసం కుస్తీ

దేశంలో అధికార కేంద్రానికి వ్యతిరేకంగా జరిపే పోరాటం ఎంత కష్టమో తెలియజెప్తున్న ఉదంతం. దేశంలో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు జనాభా ప్రకారం చూస్తే అతి తక్కువ. అందులోనూ మహిళా క్రీడాకారులు మరీ తక్కువ. ప్రభుత్వం, సమాజం వారిని ప్రోత్సహించడం ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. క్రీడల వైపు యువత చూడడం మొదలైంది. ఇలాంటి పరిస్థితిలో మహిళా క్రీడాకారుల భద్రతకు పూర్తి భరోసా కల్పించగలిగినప్పుడే ముందు ముందు సత్ఫలితాలుంటాయి. పైగా ఎన్నో అవరోధాల్ని అధిగమించి తమను తాము రుజువు చేసుకున్న కొందరు క్రీడాకారులు తమకు అన్యాయం జరిగిందని ప్రభుత్వం దృష్టికి తెస్తే సత్వరం స్పందించాలి. అమలులో ఉన్న చట్టాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలి. ఏ పౌరుడికి అన్యాయం జరిగినా స్పందించాల్సిన తీరు ఇదే అయినా, కనీసం దేశానికి పతకాలు తెచ్చినవారికైనా ఆ గౌరవం ఇవ్వాలి. అది న్యాయం పట్ల, చట్టాల పట్ల, ప్రభుత్వం పట్ల పౌరుల్లో నమ్మకం పెంచుతుంది. కానీ ఇక్కడ జరిగిందేమిటి? కుస్తీ వీరుల బాగోగులు చూడాల్సిన అధ్యక్షుడు, తన పొజిషన్ ని దుర్వినియోగ పరుస్తూ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వారు నేరారోపణ చేశారు. ఇది ఆరోపణ. ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు దర్యాప్తు, ట్రయల్ ఎలా జరగాలో చట్టం స్పష్టంగా చెప్పింది. గతంలో విశాఖ మార్గదర్శకాలు కానీ, జస్టిస్ వర్మ రిపోర్ట్ గానీ మహిళల రక్షణకు ఎన్నో విలువైన సూచనలు కూడా చేశాయి. అయితే ఈ కేసులో ఉన్న నిందితుడు అధికార పార్టీ పార్లమెంట్ సభ్యుడు. కాబట్టి చట్టం చెప్పిన ప్రక్రియలన్నీ నిదానంగా సాగుతున్నాయి. కనీసం ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్.ఐ.ఆర్) పోలీసు స్టేషన్‌లో నమోదు కావడానికి సుప్రీం కోర్టు చెప్పాల్సి వచ్చింది. అభియోగ పత్రం నెలలు గడుస్తున్నా అయిపులో లేదు. అందుకనే ఆ క్రీడాకారులు, వారికి మద్దతుగా మరికొంత మంది ఢిల్లీలో నిరసనలు చేపట్టారు. వారికి మద్దతుగా, రైతు సంఘాలు , 1983లో ప్రపంచ కప్ గెలిచిన క్రికెట్ టీమ్ తో సహా పౌరసమాజం ముందుకి వచ్చింది. ఇకనైనా వారి ఆవేదనని ప్రభుత్వం గమనంలోకి తీసుకోవాలి. నిందితుడి పవర్‌ని, పార్టీని చూడకుండా, వచ్చిన నేరారోపణ బట్టీ, చట్టం తన పని తాను చేసేలా చూడాలి. ప్రముఖులైన వారికే న్యాయం అందకపోతే సామాన్య పౌరుల మాటేమిటన్న సందేహం ప్రజలకు రాకూడదు.

- డా.డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

వ్యాఖ్య

మణిపూర్‌లో శాంతి నెలకొనాలి

మణిపూర్‌లో నెల రోజులు గడుస్తున్నా వివాదం ముగియకపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మే 3న మొదలైన మత కలహాలలో 115 మంది చనిపోయారు. వందలాది మంది గల్లంతయ్యారు. 300 మందికి పైగా గాయపడ్డారు. 115 గిరిజన గ్రామాలు, 3000కు పైగా ఇళ్లు దగ్ధమయ్యాయి. 222 క్రైస్తవ చర్చిలు, 73 సంబంధిత భవనాలు ధ్వంసమయ్యాయి. వేలాది మంది సహాయక శిబిరాల్లో ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ విఫలమయ్యాయి. హోంమంత్రి అమిత్ షా పర్యటన సందర్భంగా కూడా గిరిజన సంఘాలపై దాడులు జరిగాయి. మణిపూర్‌లో బిజెపి నియంత్రిత రాష్ట్ర ప్రభుత్వ అండతో జాత్యహంకార దాడి జరిగిందని స్పష్టమైంది. మెజారిటీ మెయితీ వర్గం మైనారిటీ కుకీ-నాగా తెగలపై ప్రణాళికాబద్ధంగా దాడి చేస్తోంది. 2002లో నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గుజరాత్‌లో జరిగిన మారణహోమం లాంటిదే ఇది. ఆ రోజు గోద్రా ఘటన పేరుతో ముస్లింలపై పెద్దఎత్తున దాడులు జరిగాయి. పాలక, పోలీసు మద్దతుతో సంఘ్ పరివార్ కార్యకర్తలు మైనారిటీలను మూకుమ్మడిగా చంపి, దోచుకుని, ఆర్థికంగా పూర్తిగా నాశనం చేశారు. ఆ రోజు దాదాపు రెండు వేల మంది చనిపోయారు. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు.

మరోవైపు, మణిపూర్‌లో, మెజారిటీ మెయితీలకు షెడ్యూల్ కుల రిజర్వేషన్లు ఇవ్వవచ్చో లేదో తనిఖీ చేయాలని హైకోర్టు కోరినప్పుడు, కుకీలతో సహా గిరిజన సంఘాల నిరసనతో ఆకస్మిక అల్లర్లు సంభవించాయి. అయితే దీని వెనుక పెద్ద ప్లాన్ ఉంది. ఇది... మణిపూర్ లోయ నుండి క్రిస్టియన్ కుకీ, నాగా తెగలను తరిమికొట్టడానికి మెయితీ వర్గం చేపట్టిన ఉద్యమం అల్లర్ల వెనుక ఉంది. బిజెపి నియంత్రణలో ఉన్న మెయితీ వర్గం ముందస్తు ప్రణాళికను అమలు చేసేందుకు అవకాశం కోసం ఎదురుచూస్తోంది. ప్రస్తుతం కూల్చివేసిన గిరిజనుల ఇళ్లకు మూడేళ్ల క్రితం సర్వే చేసి మార్కింగ్ చేసినట్లు కూడా వెల్లడైంది. గొడవ జరిగినప్పుడు కుకీ ఇళ్లను గుర్తించి నిప్పు పెట్టారు. గుజరాత్‌లో మాదిరిగా, రాష్ట్రం నిష్క్రియాత్మకంగా ఉండటమే కాదు... మెయితీ సెక్షన్ లోని సాయుధ గ్రూపులకు ఆయుధాలు అందించేందుకు పోలీసుల కుమ్మక్కు జరిగింది. కుకీ ప్రాంతంలో దాడి తర్వాత మణిపూర్ రైఫిల్స్, మణిపూర్ పోలీస్ ట్రైనింగ్ అకాడమీ నుండి మెయితీ తీవ్రవాద గ్రూపులు ఆధునిక ఆయుధాలను దోచుకున్నాయి.

మణిపూర్‌లో అమిత్ షా వచ్చిన తర్వాత కూడా, సైన్యం, పారామిలటరీ బలగాలు మోహరించిన కాంగ్‌పోక్పి జిల్లాలో, 29 మరియు 30 తేదీలలో, మెయితీ వర్గానికి చెందిన అరామై థెంగ్‌కోల్, మెయితీ లిపున్‌ల సాయుధ ఉగ్రవాద గ్రూపులు గిరిజనుల 585 ఇళ్లకు నిప్పుపెట్టాయి. 26 నుంచి 29వ తేదీ మధ్య 900కు పైగా ఇళ్లు దగ్ధమయ్యాయి. క్రైస్తవ తెగల ఇళ్లను తగులబెట్టారు. సామరస్యంగా జీవిస్తున్న రెండు వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి బిజెపి ప్రభుత్వం తన రాజకీయ ఎజెండాను అమలు చేస్తోంది. ఈ అల్లర్ల వెనుక రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ హస్తం ఉందని మణిపూర్ గిరిజన ఫోరం ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వంపైనా, పోలీసులపైనా తమకు నమ్మకం లేదని, ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్‌ను పక్కనబెట్టి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక విచారణ జరిపించాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గిరిజన ప్రాంతానికి రాష్ట్ర హోదా, కేంద్ర పాలిత హోదా లేదా స్వయం ప్రతిపత్తి కల్పించాలని అమిత్ షాతో జరిగిన సమావేశంలో డిమాండ్ చేశారు. మెయితీల దాడిని ప్రతిఘటించిన కుకీ గిరిజన వర్గాన్ని ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ తీవ్రవాదులుగా చిత్రీకరిస్తుండగా.. మణిపూర్‌లో ఉగ్రవాద ముప్పు లేదని, రెండు వర్గాల మధ్య ఘర్షణ జరుగుతోందని జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. సంకుచిత రాజకీయ దోపిడీకి తావు లేకుండా మణిపూర్ సమగ్రతను కాపాడుతూ గిరిజన సంఘాలు లేవనెత్తిన డిమాండ్లను సామరస్యపూర్వకంగా పరిష్కరించే పరిపక్వత, విజ్ఞత ప్రదర్శించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

సెటైర్

ఫోన్లో ట్రోలింగ్

ఎవడు నీవు?
మీ రెవరు?
నేనెవరైతే నీకెందుకు? రాజదండం గురించి నీకు విషయం తెలుసా..?
తెలియదు.
మరి తెలియకుండా ఎలా రాశావ్?
ఏమని?
ప్రజాస్వామ్యంలో రాజదండాలు ఎందుకని?
అవును. తప్పేముంది?
తప్పా..? తప్పున్నరా..? రాజుల్లేకుండానే పాలన వచ్చిందా..? కావాలంటే చరిత్ర చదువుకో... చేతిలో పెన్నుందీ... అచ్చేసేందుకు పత్రికలున్నాయీ... అంటే కుదరదు.
నా తప్పేంటో చెప్పకుండానే మీరు కోపగించుకుంటున్నారు.
రాజదండం ఏక పాలనకు శ్రేష్టం. ఏక్ భారత్ - శ్రేష్ట భారత్ సంభవించాలంటే పాలకుని చేతిలో ఆ పవిత్ర రాజదండం ఉండాల్సిందే...
ఎవరి చేతిలో?
ఇంకా ఎవరి చేతిలో అంటావేంటి? ప్రధాని మోడీగారి చేతిలో.
మన రాజ్యాంగం ఈ విషయం చెప్పలేదే..?
అంబేద్కర్‌కు ఏం తెలుసు? హిందూ రాజ్యాంగం ఔన్నత్యం గురించి. హ...హ... హ... అసలు అప్పటికి అంబేద్కరే పుట్టలేదు. వేల సంవత్సరాల హిందూ పాలన సంప్రదాయ పరంపర ఇది. పాలన మార్పిడి చిహ్నం రాజదండం. ఆ నెహ్రూ అప్పుడు పక్కన పెడితే... ఇప్పుడు వెతికి తెచ్చి, యజ్ఞయాగాది క్రతువులు చేసి, వేద మంత్రోచ్ఛారణ చేసి స్వీకరిస్తే.... మీబోటివాళ్ళు తెగ బాధపడిపోతున్నారు. మిడి మిడి జ్ఞానంతో నానాయాగి చేస్తున్నారు.
మోడీ బ్రహ్మచారి కాదు. వివాహితుడు. నేను సీనియర్ ఎన్టీఆర్ - అంజలీదేవి 'లవకుశ' సినిమా చూశాను. ఒకవేళ భార్య రాలేకపోతే ఆమె ప్రతిమతో కలసి యజ్ఞం చేయాలి కదా... మోడీ గారు అటు బ్రహ్మచారి గాక, ఇటు సంసారిగాక, వైధవ్యుడు కాని వానితో పూజలు, క్రతువులు చేయించి రాజదండం ప్రతిష్టించడం హిందూ బ్రాహ్మణ్య ధర్మశాస్త్రాల్లో

ఉన్నదా..?
సినిమాలు వేరు. శాస్త్రాలు వేరు. రెండింటినీ కలగాపులగం చేస్తావేమిటి?
నేనూ అనేది అదేనండి. మీ మోడీ గారేగా పనిగట్టుకుని కేరళ స్టోరీ, కాశ్మీర్ ఫైల్స్ చూడమని ప్రజలకు ఉద్బోధించారు. ఇక అసలు విషయానికి వస్తాను. ప్రజాస్వామ్యంలో ప్రజలేకదా పాలకుడిని చేస్తారు. దేవుడు కాదు కదా? ఒకవేళ దేవుడు చేస్తాడని అనుకుంటే ఆ దేవుడు కూడా ప్రజలే అవుతారు. కాదంటారా..?
నాస్తికుడిలా మాట్లాడుతున్నావ్.
అంతా దేవుడే చేస్తాడు అనుకుంటే మీరెందుకు ఓట్లు అడుక్కుంటున్నారు. మోడీ గారు మొన్న కర్ణాటక ఎన్నికల్లో అంత హడావుడి ఎందుకు చేశారు చెప్మా...
నీదంతా వితండవాదం. కుసంస్కారివి నీవు.
ఎవరిది వితండవాదమో తెలుస్తూనే ఉన్నది. పరిచయం లేకపోయినా ఫోను చేసి భయపెట్టే ధోరణిలో ఏకవచన సంబోధం చేయడంలోనే ఎవరు కుసంస్కారులో అర్థమవుతున్నది.
ఛ... టైమ్ వేస్ట్... (ఫోన్ కట్)
అవును టైమ్ వేస్టే... (కట్)
(అర్థం పర్థం లేని వెర్రివాగుడు వలన కాలహరణం అని తెలిసినా ఒక్కోసారి ఇలా జరుగుతున్నది మరి).

- కె. శాంతారావు,
సెల్ : 9959745723

ఆదివాసి కళలు, సంస్కృతితోనే గిరిజనుల జీవన విధానం

రెండో రోజు సంబరాలను ప్రారంభించిన అప్పలనర్స, సురేంద్ర

రెండో రోజు సాంస్కృతిక సంబరాలను ప్రారంభిస్తున్న గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పలనర్స, సురేంద్ర, బాలదేవ్ తదితరులు

ప్రజాశక్తి -అరకులోయ / అరకు రూరల్, అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివాసి కళలు, సంస్కృతి సంప్రదాయాలతోనే గిరిజనుల జీవన విధానం ముడిపడి ఉందని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స అన్నారు. అరకులోయలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన గిరిజన సంఘం రాష్ట్ర ఎనిమిదో మహాసభ సందర్భంగా నిర్వహిస్తున్న గిరిజన సాంస్కృతిక సంబరాలు రెండో రోజు కార్యక్రమాలను గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, రాష్ట్ర కార్యదర్శి లోత రామారావు, జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఆదివాసీ సాంస్కృతిక సంబరాలు నిర్వహణ కమిటీ చైర్మన్ చిట్టిబాబు, రఘునాథ్, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి మంగరాజుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను, ఆచార, వ్యవహారాలను, గిరిజనుల ఉనికిని కాపాడుకోవడానికి ఈ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను, వివిధ కళారూపాలను కార్పొరేట్ శక్తులు విధ్వంసం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు.

సెక్యూరిటి ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం, 2002 (ది యాక్ట్) మరియు ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ లోని సెక్షన్ 13 (2) కింద నోటీసు

వ. సంఖ్య	రుణగ్రహీత(ల) పేరు (ఎ)	తాకట్టు ఆస్తి వివరాలు (బి)	ఎన్‌పిఎ తేదీ (సి)	బకాయివున్న మొత్తం (రూ.) (డి)
1.	రుణ ఖాతా నం. HHLVJW00372377 1. రావి శివరామకృష్ణ 2. రావి సుజాత 3. గన్నే తిరుపతిరావు (గ్యారంటార్)	ఫ్లాట్ నం. 405, మూడవ అంతస్తు, బ్లాక్-ఎ, వెంకటరామ్ అవెన్యూ, డోర్ నం. 6-2 దగ్గర, ఆర్.ఎస్. నం. 107/3, 107/3ఎ, 107/3బి, నిడమానూరు రోడ్డు, పద్మనాభపురం కాలనీ దగ్గర, పోరంకి గ్రామం మరియు గ్రామ పంచాయతీ, పెనమలూరు మండలం, కృష్ణా-521137, ఆంధ్రప్రదేశ్.	29.05.2023	29.05.2023 నాటికి రూ. 15,56,476.11/- (పదిహేను లక్షల యాభై ఆరు వేల నాలుగు వందల డెబ్భై ఆరు రూపాయలు మరియు పదకొండు పైసలు మాత్రమే)

పైన పేర్లు ఇవ్వబడిన రుణ గ్రహీత(లు) రుణ ఖాతా(ల)లో ఆర్థిక క్రమశిక్షణను పాటించడంలో విఫలమయ్యారు మరియు కంపెనీ నిర్వహించే మామూలు వ్యాపార నిర్వహణలో తేలిందేమిటంటే నిర్వహించబడే ఖాతాల పుస్తకాల ప్రకారం, బకాయివున్న మొత్తాన్ని కాలమ్ డి సూచిస్తోంది.

రుణ గ్రహీత(లు) అప్పు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో పదేపదే విఫలమవుతున్న కారణంగా, రెగ్యులేటరి అథారిటి జారీచేసిన ఆస్తుల వర్గీకరణకు సంబంధించిన మార్గదర్శకాల లోపల సదరు రుణ ఖాతాను కంపెనీ నిరర్థక ఆస్తిగా వర్గీ కరించడమైనది (కాలమ్ సిలో తేదీ నాటికి ఉన్నట్లుగా). అనంతరం, ప్రతి రుణగ్రహీతకు చట్టంలోని సెక్షన్ 13 (2) ప్రకారం నోటీసులు కూడా జారీచేయడమైనది.

పై విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుంచి 60 రోజుల లోపల అప్పటి వరకు అయినవడ్డీ, ఖర్చులు మరియు చార్జీలతో సహా, పైన కాలమ్ డి లో సూచించబడిన చెల్లించవలసిన బకాయిలు మొత్తాన్నీ చెల్లించడం ద్వారా కంపెనీ పట్ల ఉన్న అతని/ఆమె బాధ్యతలను పూర్తిగా నెరవేర్చవలసిందిగా పై రుణగ్రహీత(లు)ను కంపెనీ కోరుతోంది, అలా చెల్లించని పక్షంలో, పైన కాలమ్ బిలో తెలియజేసిన తనఖాఆస్తిని స్వాధీనం చేసుకునేందుకు కంపెనీకి హక్కువుంది మరియు చట్టంలో కంపెనీకి లభించే ఎలాంటి ఇతర చర్యలను కూడా తీసుకుంటుంది.

సర్ఫేయిసి చట్టం సెక్షన్ 13 లోని ఉప-సెక్షన్ (8) నిబంధనల ప్రకారం, ''బహిరంగ వేలం ద్వారా, ప్రజల నుంచి కొటేషన్, టెండర్ పిలవడం ద్వారా లేదా ప్రైవేట్ ట్రీటీ ద్వారా సెక్యూర్డ్ అస్తి(ల)ను విక్రయించేందుకు నోటీసు ప్రచురితమైన తేదీ వరకు సెక్యూర్డ్ క్రెడిటార్ ద్వారా మాత్రమే అయిన వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులతో పాటు అవుట్‌స్టాండింగ్ బకాయిల పూర్తి మొత్తాన్ని రుణగ్రహీత సమర్పించవచ్చు. పైన తెలియజేసిన చట్టబద్ధంగా ప్రిస్క్రయిబ్ చేసిన కాల వ్యవధి లోపు సెక్యూర్డ్ ఆస్తిని రిడీమ్ చేసుకోవడంలో రుణగ్రహీత విఫలమైతే, ఆస్తిని రిడీమ్ చేసుకునేందుకు రుణగ్రహీతకు హక్కు లేదని కూడా గమనించాలి.''

సర్ఫేయిసి చట్టంలోని సెక్షన్ 13లోని ఉప-సెక్షన్ (13) నిబంధనల ప్రకారం, సెక్యూర్డ్ క్రెడిటార్ నుంచి ముందుగా రాతపూర్వక సమ్మతి లేకుండా, నోటీసులో ప్రస్తావించిన సెక్యూర్డ్ ఆస్తులు వేటినైనా విక్రయం, లీజు లేదా ఇతరత్రా (తన వ్యాపారం యొక్క సాధారణ కోర్సులో కాకుండా ఇతరత్రా) బదిలీచేయకుండా మిమ్మల్ని ఇందుమూలంగా నిషేధించడమైనది.

ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున,
అధీకృత అధికారి

స్థలం : కృష్ణా

ప్రజల్లోకి సంక్షేమ కార్యక్రమాలు

- విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసిపి ప్రధాన కార్యదర్శి, అనుబంధ విభాగాల ఇన్‌ఛార్జి వి విజయసాయిరెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ... పార్టీలో అనుబంధ విభాగాలన్నీ ప్రజల్లో చురుకుగా పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. 2024లో గెలుపు కోసం సమిష్టిగా పనిచేయాలని కోరారు. వైసిపి కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైసిపి అనుబంధ విభాగాల కో-ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, పోతుల సునీత, యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులకు తక్షణం పరిహారం ఇవ్వాలి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా పరిహారాన్ని తక్షణం విడుదల చేయాలని ఎపి రైతు సంఘం డిమాండ్ చేసింది. వడ్డేశ్వరంలోని ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి హాజరైన రైతు సంఘాల నాయకులు.. రైతుల సమస్యలపై చర్చించారు. ఈ మేరకు బుధవారం ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర కమిటీ నిర్ణయాలను ఒక ప్రకటనలో వెల్లడించారు. ఖరీఫ్ సీజన్ వస్తున్నా.. ఇప్పటిదాకా రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో వుంచలేక పోయిందని విమర్శించారు. తక్షణం విత్తనాలు, ఎరువులు అందుబాటులో వుంచాలని కోరారు. అనంతపురం, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులను ఆదుకోవాలని కోరారు. విజయనగరం జిల్లాలో 2020-21, 2021-22లో ధాన్యం రవాణాలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

మాల్దీవుల అగ్నిప్రమాద మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున అందజేత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాల్దీవుల్లో సంభవించిన అగ్నిప్రమాదంలో మరణించిన ఐదుగురి కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ కింద ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు చొప్పున రాష్ట్ర ఐటిశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సచివాలయంలో బుధవారం అందజేశారు. మృతుల్లో నలుగురు పశ్చిమగోదావరి జిల్లాకు చెందినవారు కాగా, మరొకరు చిత్తూరు జిల్లాకు చెందినవారు ఉన్నారు.

కాగ్ రిపోర్ట్ చూసి కేంద్రం కళ్ళు తెరవాలి

ప్రజాశక్తి- జామి (విజయనగరం జిల్లా)

ప్రపంచంలో అతిపెద్ద రైల్వే వ్యవస్థలో ఒక్కటైన భారతీయ రైల్వేలో తరచూ ఎందుకు ప్రమాదాలు జరుగుతున్నాయో వివరాలతో కాగ్ విడుదల చేసిన 2022 (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) రిపోర్టుని కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అర్థం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాగ్ నివేదిక ప్రకారం 2017 నుండి 2021 వరకూ నాలుగేళ్ళలో 1129 రైల్వే ప్రమాదాలు దేశంలో చోటు చేసుకున్నాయన్నారు. వీటిల్లో 156 ప్రమాదాలు సరియైన సమయానికి మెయింటెనెన్సు లేక జరిగాయని, ఇందులో 182 ప్రమాదాలు రైల్వే మెకానికల్ డిపార్ట్మెంట్ నిర్లక్ష్యం కారణంగా జరిగాయని, ఓవర్ స్పీడ్ కారణంగా 154 ప్రమాదాలు జరిగాయని, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ నిర్లక్ష్యం కారణంగా 400 ప్రమాదాలు జరిగాయని చెప్పారు. ఇన్ని పొరపాట్లు జరుగుతున్నా కేంద్ర రైల్వే శాఖ అధికారులు ఎటువంటి విచారణ చేపట్టలేదని కాగ్ తప్పు పట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే శాఖకి 2017 నుండి 2021 వరకూ భద్రతా నిధి పేరుతో 20 వేల కోట్ల రూపాయలు ఇవ్వవలసి ఉండగా రూ.15,770 కోట్లు మాత్రమే ఇచ్చి ఇందులో ఏడాదికి 2,300 కోట్ల రూపాయలు నిధులు మళ్లించారని కాగ్ ఆరోపించిందని భీశెట్టి అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే శాఖని సేవారంగం నుండి తప్పించి వ్యాపార రంగంగా మార్చివేసిందని, అన్ని విభాగాలను ప్రైవేటు పరం చేస్తూ రైల్వే శాఖ ఉద్యోగుల్లో అసంతృప్తి పెంచారన్నారు. కీలకమైన ఇంటర్ లాకింగ్, రైల్వే ట్రాక్ నిర్వహణ కూడా ప్రైవేట్ చేసారని, దేశ వ్యాప్తంగా 3 లక్షల మంది కేవలం సేఫ్టీ సిబ్బంది అవసరం ఉంటే 35 వేలమంది మాత్రమే రైల్వే శాఖలో పనిచేస్తున్నారని అన్నారు. ఒడిశా రైలు ప్రమాదం ఘటన తరువాత భారత రైల్వే భద్రతపై ప్రతి ఒక్కరూ ఆందోళన చెందుతున్నారని, కరోనా తరువాత దేశ వ్యాప్తంగా రైల్వేలో సీనియర్ సిటిజన్లకు ఎటువంటి రాయితీలు లేకుండా కోత కోసిన తీరుపై మండిపడ్డారు. స్టేషన్ల ఆధునీకరణ కంటే, ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు పెంచే ప్రయత్నం రైల్వే అధికారులు చెయ్యాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకుడు భీంపల్లి భాస్కర్ పాల్గొన్నారు.

పన్నులు వసూలు చేస్తాం.. అప్పు ఇవ్వండి..!

- ప్రపంచబ్యాంకుకు తిరుపతి కార్పొరేషన్ మొర

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగర పాలక సంస్థ అభివృద్ధికి ప్రపంచబ్యాంక్ ఫైనాన్స్ చేయనుంది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్‌కు వచ్చే ఆదాయ వనరులు, అప్పు తీర్చే మార్గాలపై వరల్డ్ బ్యాంక్ ప్రతినిధి విజయశేఖర్‌తో నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. నగర పాలక సంస్థలకు, మున్సిపాలిటీలకు ఆర్థిక వనరులు సమకూర్చుటకు అవసరమైన ఫైనాన్స్ అందించేందుకు ప్రపంచబ్యాంక్ చేయూతనిస్తుందని విజయ్‌భాస్కర్ తెలిపారు. చేపట్టబోయే ప్రాజెక్టుల విలువ, వాటి ఆవశ్యకత, వాటి ద్వారా నిధులు తిరిగి ఎలా వస్తాయి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. తమ సంస్థతో చర్చించి నిధులు ఫైనాన్స్ ఇచ్చేందుకు ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. హరిత, భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో చేపట్టిన ప్రాజెక్టులు పూర్తయితే కార్పొరేషన్‌కు ఆదాయ వనరులు పెరుగుతాయన్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లు రావడం వల్ల ఆయా ప్రాంతాల్లో ఇళ్లు, అపార్టుమెంట్లు, కార్యాలయాలు, షాపులు రావడం వల్ల పన్నుల రూపంలో నగర పాలక సంస్థకు ఆదాయం సమకూరుతుందన్నారు. మల్టీ లెవల్ కారు పార్కింగ్, వేస్ట్ మేనేజిమెంట్ ద్వారా ఆదాయం సమకూరుతుందని తెలిపారు. రానున్న కాలంలో వరల్డ్‌బ్యాంక్ వారితో మరింతగా చర్చించి ప్రజా ప్రయోజన ప్రాజెక్టులకు అవసరమైన ఫైనాన్స్ స్థితిగతులపై చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

Chola Enter a better life

చోళమండళం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీసు: 1వ అంతస్తు, 'డేర్ హౌస్', నెం.2, ఎన్.ఎస్.సి.బోస్ రోడ్, చెన్నై-600 001
బ్రాంచ్ చిరునామా: 1వ& 4వ అంతస్తు, శాంతిప్లాజా, డోర్ నం.59-14-2ఎ, గాయత్రినగర్, బెంజ్‌సర్కిల్, విజయవాడ-500008

రూల్ 8(1) క్రింద స్వాధీనతా ప్రకటన

ఏదైతే, క్రింది సంతకందారులు మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా కాలమ్ (డి)లో పేర్కొనబడిన మొత్తాలను దిగువ వడ్డీతో తిరిగి చెల్లించవలసిందిగా కాలమ్ (సి)లో పేర్కొన్న తేదీలపై కాలమ్ (బి)లో పేర్కొన్న పేర్లుగల రుణగ్రహీలను కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి. రుణగ్రహీతలు మొత్తంను తిరిగిచెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సెక్యూరిటి ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2022లోని రూల్ 8తో చదువగల సదరు చట్టంలోని సెక్షన్13 ఉప-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ కాలమ్ (ఎఫ్)లో పేర్కొన్న సంబంధిత దిగువ కాలమ్ (ఇ)లో వివరించిన కంపెనీతో తాకట్టుపెట్టిన ఆస్తులను స్వాధీనంలోకి తీసుకున్నారు. సెక్యూర్డు ఆస్తుల విమోచనానికి అందుబాటులోఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 ఉప-సెక్షన్ (8) నియమాల క్రింద రుణగ్రహీత శ్రద్ధను కోరుతున్నారు. ప్రధానంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, కాలమ్ (ఇ)లో పేర్కొన్న ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆసులతో ఎవరైనా ఏవేని లావాదేవీలు జరుపదలచిన వారు మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ వారికి వడ్డీ మరియు ఇతర చార్జీలతోసహా కాలమ్ (డి)లో పేర్కొన్న మొత్తాలు మరియు దానిపై చెల్లించుటకు లోబడి ఉంటుంది.

క్ర. సం. [A]	రుణగ్రహీత పేరు & చిరునామా & రుణ ఖాతా నెంబరు [B]	డిమాండ్ నోటీసు తేదీ [C]	బాకీపడిన మొత్తం [D]	ఆస్తి వివరాలు [E]	స్వాధీనత తేదీ [F]
డోర్ నెం.17-9-41, 6వ లేన్, ఆనందపేట, గుంటూరు సిటి, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు జిల్లా వద్దగలపాత వార్డు నెం.9, న్యూవార్డు నెం.14, బ్లాక్ నెం.11, టి.ఎస్.నెం.774, పాత అస్‌స్ నెం.25040, న్యూ అసెస్ నెం.84503 వద్దగల 120.00చ.గ.ల విస్తీర్ణపు స్థలంపైగల ఆర్‌సిసి బిల్డింగ్ మొత్తం మరియు **సరిహద్దులు:** తూర్పు: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్ 24.0అ.లు, దక్షిణం: ఎస్‌కె. మహబూబ్ సుబ్బాని ఆస్తి 45.0అ.లు, పడమర: కప్పెర జాన్‌ఆస్తి 24.0అ.లు, ఉత్తరం: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్ 45.0అ.లు,

తేది: 02-06-2023
ప్రదేశం: గుంటూరు

సం/- అధీకృత అధికారి
పెగాసస్ అసెట్స్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్
(పెగాసస్ గ్రూప్ థర్టీ నైన్ ట్రస్టు 1 యొక్క ట్రస్టీ)

దక్షిణమధ్యరైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

ఇ-వేలం ప్రకటన నెం.బిజెడ్ఏ.3/2023-24, తేది: 01.06.2023
PUB/0600

భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ వారు డివిజన్‌పైగల పే& యూజ్ టాయిలెట్స్, క్లాక్ రూమ్ & పార్కింగ్ స్టాండ్ కాంట్రాక్టుల కొరకు ఐఆర్‌ఇపిఎస్: www.ireps.gov.in యొక్క 'ఇ-వేలం లీజింగ్' మోడ్యూల్ ద్వారా ఇ-వేలం కొరకు పద్దెనిమిది సంవత్సరాలు నిండిన భారతీయులు మరియు కంపెనీలు/ సంస్థల ఆహ్వానిస్తున్నారు.

ఇ-వేలం షెడ్యూలు వివరాలు దిగువ ఇవ్వబడినది. వేలంలో ఆఫర్‌చేసిన ఆస్తుల వివరాలు ఐఆర్‌ఇపిఎస్ వెబ్‌సైట్ లో చూడవచ్చును.

కాంట్రాక్టు రకం: పే& యూజ్ టాయిలెట్స్, **వేలంలో ఆఫర్‌చేసిన లాట్ల సంఖ్య:** గూడూరు, చీరాల, కావలి, తెనాలి, గుడివాడ, కాకినాడ పోర్ట్, కాకినాడ టౌన్, అనకాపల్లి, తుని, సింగరాయకొండ, నిడదవోలు, అన్నవరం, భీమవరం జంక్షన్, గోదావరి, యలమంచిలి, విజయవాడ పార్శిల్ ఆఫీస్ రైల్వే స్టేషన్ల దగ్గర 16 పే& యూజ్ టాయిలెట్లు. **వేలం షెడ్యూల్ తేది మరియు తెరుచు సమయం:** 08.06.2023న 11.00గం.లు.

కాంట్రాక్టు రకం: క్లామ్ రూమ్, **వేలంలో ఆఫర్‌చేసిన లాట్ల సంఖ్య:** సమాల్‌కోట్, తెనాలి, గుడూరు స్టేషన్ల వద్ద 03 క్లాక్ రూమ్ కాంట్రాక్టులు. **వేలం షెడ్యూల్ తేది మరియు తెరుచు సమయం:** 08.06.2023న 13.40గం.లు.

కాంట్రాక్టు రకం: పార్కింగ్ స్టాండ్ కాంట్రాక్టులు, **వేలంలో ఆఫర్‌చేసిన లాట్ల సంఖ్య:** 09 పార్కింగ్ స్టాండ్స్ కాంట్రాక్టులు: అనగా గోదావరిలో జనరల్ కమ్ ప్రీమియం టూ వీలర్, భీమవరం జంక్షన్‌లో ప్రీమియం టూ వీలర్, గూడూరులో జనరల్ ఫోర్ వీలర్, నెల్లూరులో జనరల్ టూ వీలర్, పవర్‌పేట జనరల్ టూ వీలర్, చిలకలపూడిలో జనరల్ టూ వీలర్, కొవ్వూరులో జనరల్ టూ వీలర్, అత్తిల్లి వద్ద జనరల్ టూ వీలర్, తరిగోపుల్ల స్టేషన్లలో జనరల్ టూ వీలర్ **వేలం షెడ్యూల్ తేది మరియు తెరుచు సమయం:** 08.06.2023న 15.00గం.లు.

1) ఇ-వేలములలో పాల్గొనుటకు డిజిటల్ సిగ్నేచర్‌ను పొందడం బిడ్డరుదారుల బాధ్యత.
2) బిడ్డరుదారులు తప్పనిసరిగా ఎస్‌బిఐలో కరెంటు ఖాతాను కలిగిఉండాలి మరియు ఇది ఐఆర్‌ఇపిఎస్‌లో ఇ-వేలం లీజింగ్ మోడ్యుల్‌తో లింక్ ఉండాలి.
3) ఇ-వేలంలో పాల్గొనుటకు ఒన్‌టైన్ ఆన్‌లైన్ సెల్ఫ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి, తద్వారా భారతీయ రైల్వేలోని ఏ డివిజన్ యొక్క ఏ వేలంలోనూ పాల్గొనడానికి భౌగోళిక పరిమితులు లేవు.
4) పై పేర్కొన్న ఇ-వేలం తేదీలపై టైమ్ స్లాట్స్ ఐఆర్‌ఇపిఎస్ అప్లికేషన్ (www.ireps.gov.in)లో ఇ-వేలం లీజింగ్ మోడ్యూల్‌లో అందుబాటులో కలవు. దయచేసి దాని ప్రకారం గమనించి పాల్గొనాలి.

ఇ-వేలం సమయంలో ఐఆర్‌ఇపిఎస్ పోర్టల్‌లో ఏర్పడే ఏదైనా అడ్డంకికి రైల్వే అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించదు. ఇ-వేలం విధానాన్ని అర్థం చేసుకోవడానికి మరియు పాల్గొనడానికి ఐఆర్‌ఇపిఎస్ అప్లికేషన్ (www.ireps.gov.in) యొక్క హోమ్‌పేజీలోని లెఫ్ట్ నావిగేషన్ బార్‌లో లెర్నింగ్ సెంటర్ లింక్ అందుబాటులో ఉన్నప్పటికీ, వినియోగదారు మాన్యువల్ ద్వారా వెళ్లాలని బిడ్డరుదారులకు సలహా ఇవ్వడమైనది.

A0851
సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, విజయవాడ

ప్రజాశక్తి
www.prajasakti.com

దూరదర్శన్ తొలి ఇంగ్లీష్ యాంకర్

గీతాంజలి అయ్యర్ మృతి

న్యూఢిల్లీ : దూరదర్శన్ తొలి ఇంగ్లీష్ యాంకర్ గీతాంజలి అయ్యర్ బుధవారం మృతి చెందారు. ఆమె వయస్సు 76 ఏళ్లు. కొంత కాలం నుంచి అమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం న్యూఢిల్లీలోని స్వగృహంలో కొంత అస్వస్థతకు గురికాగా, సహాయక సిబ్బంది ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు తెలిపారు. గీతాంజలి దూరదర్శన్‌లో 1971 నుంచి 30 ఏళ్ల పాటు యాంకర్‌గా పని చేశారు. దూరదర్శన్ స్వర్ణయుగ కాలంలో ఆమె ప్రముఖ యాంకర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. నాలుగుసార్లు ఉత్తమ యాంకర్ పురస్కారాన్ని అందుకున్నారు. ఇందిరాగాంధీ ప్రియదర్శని అవార్డును కూడా గెలుచుకున్నారు. గీతాంజలికు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న ఈ ఇద్దరూ వచ్చాక గీతాంజలి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆమె సన్నిహితురాలు సుమిత మెహతా తెలిపారు.

23న పాట్నాలో ప్రతిపక్షాల భేటీ

- రాహుల్ గాంధీ ,ఏచూరి సహా పలువురు కీలకనేతల హాజరు

పాట్నా: పాట్నాలో ప్రతిపక్ష పార్టీల సమావేశం ఈ నెల 23న జరగనుంది. జూన్ 12న జరగాల్సిన సమావేశం ఇప్పుడు జూన్ 23న జరుగుతుందని బీహార్ సీఎం నితీశ్ కుమార్ , జేడీయూ అధ్యక్షుడు లాలన్ సింగ్ బుధవారం తెలిపారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ కూడా పాల్గొననున్నారు. వీరితో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, మమతా బెనర్జీ, ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్, కేజ్రీవాల్, హేమంత్ సోరెన్, స్టాలిన్, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్‌లు కూడా పాల్గొననున్నారు.. అందరి అంగీకారంతో సమావేశం తేదీని ఖరారు చేశారు. సీతారాం ఏచూరి, డి రాజా, దీపాంకర్ భట్టాచార్య వంటి వామపక్ష నేతలు కూడా ఈ సమావేశానికి హాజరుకానున్నారు.

నితీశ్ చొరవతో..

ప్రతిపక్షాల ఐక్యతకు సంబంధించి నితీశ్ కుమార్ చొరవతో ఈ సమావేశం నిర్వహించబడుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 2022 నుంచి నితీశ్ కుమార్ ప్రతిపక్ష పార్టీలను కలుపుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని కలిసిన తర్వాత మే నెలలోనే ఢిల్లీకి తిరిగి వచ్చారు.

బీహార్ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ మాట్లాడుతూ ప్రతిపక్షాల సమావేశ కార్యక్రమం పాట్నాలో జరుగుతుందని చెప్పారు.

ఒడిషాలో మరో రైలు ప్రమాదం

- ఆరుగురి కార్మికుల మృతి..

ఝాజ్‌పూర్: ఒడిషాలో మరో రైలు ప్రమాదం సంభవించింది. బాలాసోర్ జిల్లాలో మూడు రైళ్ల ప్రమాదం ఇంకా మర్చిపోకముందే తాజాగా బుధవారం మరో రైలు ప్రమాదం జరిగింది. ఇక్కడి ఝాజ్‌పూర్ రైల్వే స్టేషన్‌లో ఓ విషాదకర ఘటన చోటుచేసుకుంది. గూడ్స్ రైలుకు చెందిన నిరుపయోగ బోగీ చక్రాల కింద నలిగి ఆరుగురు కార్మికులు మృతి చెందగా..మరో ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ రైల్వే స్టేషన్‌లో కొంతకాలంగా ఇంజన్ లేని గూడ్స్ రైలు నిలిపి ఉంది. బుధవారం రైల్వే మరమ్మతులు చేయడానికి కార్మికులు రాగా.. ఒక్కసారిగా ఈదురుగాలులతో వర్షం పడింది. దీంతో గూడ్స్ బోగీ కింద రైల్వే కార్మికులు తలదాచుకున్నారు. ఆ సమయంలో భారీ ఈదురుగాలులకు బోగీలు కదలడంతో రైలు చక్రాల కింద నలిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కటక్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

కెనడాలో కార్చిచ్చులు

- సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపులు

మాంట్రియల్ : కెనడాలో నార్తరన్ క్యుబెక్ ప్రావిన్స్‌లో ఉత్తర, వాయవ్య ప్రాంతాల్లో పలు చోట్ల కార్చిచ్చులు సంభవించాయి. కార్చిచ్చు నివారణా సంస్థ అందచేసిన వివరాల ప్రకారం, ప్రావిన్స్‌లో మంగళవారం 150కి పైగా కార్చిచ్చులు సంభవించాయి. వీటిలో 110 సంఘటనల్లో పరిస్థితులు అదుపు తప్పాయని అధికారులు తెలిపారు. ఈ దావానలం నుండి వస్తున్న దట్టమైన నల్లని పొగ అమెరికా ఈశాన్య ప్రాంతం, తూర్పు కెనడాల్లోని భాగాలను కమ్మేసింది. దీంతో కమిలిపోయిన వాసనలు ఆ ప్రాంతంలో విపరీతంగా వున్నాయి. పైగా ఆకాశమంతా నారింజరంగు వర్ణాన్ని సంతరించుకోవడంతో అక్కడి ప్రజలను ఇళ్ళలోంచి బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. క్యుబెక్‌లో వందలాది దావానలం ఘటనల ప్రభావం సుదూరంగా వున్న న్యూయార్క్ నగరాన్ని, న్యూ ఇంగ్లండ్‌ను తాకింది. ప్రజల గొంతుల్లో మంట మొదలైంది. దీంతో ప్రావిన్స్‌లో మారుమూల ప్రాంతమైన క్యుబెక్ పట్టణాన్ని ఖాళీ చేయించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. గంటగంటకూ పరిస్థితిని సమీక్షిస్తున్నామని ప్రధాని ఫ్రాంకోయిస్ లీగల్ట్ విలేకర్లకు తెలిపారు. క్యుబెక్‌లో పరిస్థితిని చూసినట్లైతే చాలా ప్రాంతాల్లో ఆందోళనకర పరిస్థితులు వున్నాయన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని చెప్పారు. అసలు చెట్లే లేని చోట మొదటగా మంటలు ఆరంభమయ్యాయని నగర మేయర్ గే లాఫ్రెనిర్ తెలిపారు. పలు కమ్యూనిటీలు, పలు ప్రాంతాలు తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయని, క్లోవా గ్రామమైతే పూర్తిగా దగ్ధం కావడం మినహా మరో మార్గం లేదని ప్రధాని లీగల్ట్ తెలిపారు. అయితే తగ్గిన ఉష్ణోగ్రతలు, గాలి దిశ మారడం, నెమ్మదిగా పొగ తగ్గడంతో పరిస్థితి కాస్త మెరుగైందని చెప్పారు. ఈ సమయంలో వర్షాలు పడాలని కోరుకోవడం లేదని, దానివల్ల మంటలతో పోరు మరింత కష్టమవుతుందని చెప్పారు.

ఆగని హింసాత్మక ఘటనలు

- మణిపూర్‌లో అంబులెన్స్‌కు మెయిటీ గ్రూపు నిప్పు
- ఏడేళ్ల బాలుడు, తల్లి, మరొక వ్యక్తి సజీవ దహనం

అమిత్ షా ఇంటి ముందు నిరసన చేస్తున్న కుకీ సంఘం సభ్యులు

న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు ఆగటం లేదు. కొందరు నిరసనకారులు అంబులెన్సుకు నిప్పుపెట్టడంతో ముగ్గురు సజీవ దహనమయ్యారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఇప్పుడు ఆందోళనను రేకెత్తిస్తున్నది. ఆందోళనలకు అడ్డుకట్ట వేయటంలో విఫలమవుతున్న బిజెపి ప్రభుత్వ తీరుపై ప్రతిపక్ష నాయకులు, సామాజికవేత్తలు, పౌర సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. 2000 మంది మెయిటీ గ్రూపు ఆదివారం ఇంఫాల్ శివార్లలో పోలీసుల ముందు అంబులెన్సును తగలబెట్టింది. దీంతో ఈ అంబులెన్సులో ఉన్న బుల్లెట్ గాయాలతో ఆస్పత్రికి తరలించబడుతున్న ఏడేళ్ల బాలుడు, తల్లి, వారి బంధువు సజీవ దహనమయ్యారు. అయితే, ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. మృతులను టోన్సింగ్ హాంగ్సింగ్ (7), అతని తల్లి మీనా హాంగ్సింగ్ (45) (ఈమె కుకీని వివాహం చేసుకున్న మెయిటీ క్రిస్టియన్), వారి బంధువు మెయిటీ క్రిస్టియన్ అయిన లిడియా లౌరెంబమ్(37)గా గుర్తించారు.

అనేక మంది కుకీలు బస చేసిన అస్సాం రైఫిల్స్ క్యాంపులోనే వారు(మృతులు) ఆశ్రయం పొందుతున్నారు. ఇది (క్యాంపు) ఇంఫాల్‌కు పశ్చిమాన 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న కాంగ్‌చుప్‌లో ఉన్నది. అయితే ఆదివారం సాయంత్రం నిరసనకారులు జరిపిన కాల్పుల్లో టోన్సింగ్‌కు బుల్లెట్ గాయమైంది. దీంతో పోలీసుల భద్రత నడుమ అంబులెన్సులో ఆస్పత్రికి వెళ్తున్న క్రమంలో మెయిటీ గ్రూపు వాహనాన్ని అడ్డుకున్నది. నిప్పంటించి దారుణానికి తెగబడింది. "మే 3 నుంచి మేము అనేక వేధింపులను ఎదుర్కొంటున్నాము. కానీ, ఆదివారం నాటి ఘటన దారుణం" అని మృతుల బంధువుల్లో ఒకరైన పోలెన్‌లాల్ హాంగ్సింగ్ అన్నారు. "శరీరాలు కాలిపోయాయి. బూడిదలో కొన్ని ఎముకలు మాత్రమే కనిపించాయి" అని పావోలెన్‌లాల్ అనే పాఠశాల ఉపాధ్యాయుడు చెప్పారు. పోలీసులెవరూ తనను సంప్రదించలేదనీ, తాను పోలీసు స్టేషన్‌కు వెళ్లడానికి భయపడుతున్నానని అంబులెన్స్ దాడిలో తన కొడుకు, భార్యను కోల్పోయిన జాషువా హాంగ్సింగ్ తెలిపారు. ఎస్పీ ఎదుటే అంబులెన్సుకు నిప్పంటించారనీ, ముగ్గురు వ్యక్తులు మరణించారని ఆదివారం సాయంత్రం తర్వాత తమకు తెలిసిందని అస్సాం రైఫిల్స్, ఆర్‌ఎఎఫ్ వర్గాలు తెలిపాయి. డ్రైవర్, నర్సు అక్కడి నుంచి పరారైనట్టు తెలుస్తున్నది.

అమిత్ షా ఇంటి బయట కుకీ సంఘం సభ్యుల నిరసన – 'సేవ్ కుకీ లైవ్స్' సందేశాలతో ప్లకార్డుల ప్రదర్శన

మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండకు వ్యతిరేకంగా కుకీ కమ్యూనిటీకి చెందిన ప్రజలు దేశరాజధాని న్యూఢిల్లీలోని కేంద్ర హోం మంత్రి అమిత్ షా నివాసం బయట నిరసన ప్రదర్శనను నిర్వహించారు. 'సేవ్ కుకీ లైవ్స్(కుకీల ప్రాణాలను కాపాడండి)' అనే సందేశాలతో కూడిన ప్లకార్డులను వారు ప్రదర్శించారు. నినాదాలు వినిపించారు. అయితే, ఆందోళనకారుల్లో నలుగురిని సమావేశం కోసం హోం మంత్రి నివాసంలోకి అనుమతించారు. మిగతావారిని జంతరమంతర్‌కు తరలించారు. కాగా మణిపూర్‌లో చెలరేగిన హింస కారణంగా ఇప్పటి వరకు దాదాపు 98 మంది మరణించగా, 310 మందికి పైగా గాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 37,450 మంది ఆశ్రయం పొందుతున్నారు.

11న సచిన్ పైలట్ కొత్త పార్టీ?

జైపూర్ : రాజస్థాన్ కాంగ్రెస్‌లో అంతర్గత సంక్షోభం మరో కొత్త పార్టీ ఆవిర్భావానికి కారణమవుతోంది. కాంగ్రెస్ నాయుకులు సచిన్ పైలట్ నేతృత్వంలో కొత్త పార్టీ ఏర్పాటు కానుంది. కొత్త పార్టీకి సంబంధించి అన్ని ఏర్పాట్లను సచిన్ పైలట్ ఇప్పటికే పూర్తి చేశారని, ఈ నెల 11న కొత్త పార్టీని అధికారికంగా ప్రకటిస్తారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. జూన్ 11న సచిన్ పైలట్ తండ్రి రాజేష్ పైలట్ జయంతి. ఈ కారణంగానే ఈ నెల 11న సచిన్ కొత్త పార్టీని ప్రకటించనున్నారని చెబుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లాట్‌పై సచిన్ కొంతకాలం నుంచి అసంతృప్తిగా ఉన్నారు. పార్టీతో సంబంధం లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇవి పార్టీని, గెహ్లాట్‌ను కలవరపరుస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబరులోగా రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

రానున్న 48 గంటల్లో ... కేరళకు రుతుపవనాలు

న్యూఢిల్లీ : జూన్ మొదటి వారం గడిచినా దేశంలో నైరుతి రుతుపవనాలు జాడ లేకపోవడం ఆందోళన కలిగిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆగ్నేయ అరేబియా సముద్రంలో ఏర్పడిన 'బిపోర్‌జాయ్' తుపాను కారణంగా ఈ రుతుపవనాలు ఆలస్యమవ్వొచ్చనే అంచనాలు కూడా వినిపిస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో దీనిపై భారత వాతావరణ శాఖ చల్లని కబురు వినిపించింది. మరో 48 గంటల్లో నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశముందంటూ బుధవారం ప్రకటించింది. 'రుతుపవనాల రాకకు దక్షిణ అరేబియా సముద్రం, లక్షద్వీప్, వాయువ్య, ఈశాన్య బంగాళాఖాతంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. రానున్న 48 గంటల్లో ఇవి కేరళ తీరాన్ని తాకే అవకాశముంది' అని వాతావరణ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది.

గతేడాది జూన్ 1నే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకగా.. ఈ ఏడాది ఆ తేదీ నాటికి కనీసం శ్రీలంకను కూడా దాటలేదు. వాతావరణ మార్పుల కారణంగా ఈ సారి రుతుపవనాల రాక ఆలస్యమవుతోంది. తొలుత జూన్ 4 నాటికి తీరం తాకొచ్చని అంచనా వేసినా.. 7వ తేదీ వచ్చినా రుతుపవనాల ఆచూకీ కన్పించట్లేదు. రుతుపవనాల ఆలస్యంతో దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఈ వానాకాలంలో వర్షపాతం అయిదు శాతం వరకూ తగ్గవచ్చని అంచనా.

వేగంగా బలపడుతున్న 'బిపోర్‌జాయ్'
తీర ప్రాంత ప్రజలు అప్రమత్తం

మరోవైపు, అరేబియా సముద్రంలో ఏర్పడిన బిపోర్‌జాయ్ తుపాను వేగంగా బలపడుతోంది. తీవ్ర తుపానుగా మారిన బిపోర్‌జాయ్.. బుధవారం ఉదయం 5.30 గంటలకు గోవాకు 890 కిలోమీటర్ల దూరంలో పశ్చిమాన – నైరుతి ప్రాంతంలో, ముంబయికి 1,000 కిలోమీటర్ల దూరంలో నైరుతిలో, పోర్‌బందర్‌కు 1,070 కిలోమీటర్ల దూరంలో దక్షిణాన – నైరుతిలో, కరాచీకి 1,370 కిలోమీటర్ల దూరంలో దక్షిణాన కేంద్రీకతమై ఉంది. రాగల మూడు రోజుల్లో ఇది ఉత్తరాన – వాయువ్య దిశలో కదిలే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అయితే, ఈ తుపాను కారణంగా అరేబియా తీర ప్రాంతాలకు ఎలాంటి పెను ముప్పు లేదని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ముందు జాగ్రత్త చర్యగా తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. సముద్రంలోకి ఎవరూ వెళ్లొద్దని హెచ్చరిస్తున్నారు.

సౌదీ నేతలతో బ్లింకెన్ చర్చలు

- బెడిసికొట్టిన సంబంధాల పునరుద్ధరణకు యత్నం

జెడ్డా : సౌదీ అరేబియా, అమెరికా మధ్య సంబంధాలు బెడిసికొట్టిన నేపథ్యంలో మంగళవారం అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఆ దేశానికి చేరుకున్నారు. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న అగాథాన్ని తగ్గించుకోవడానికి అమెరికా నానా అవస్థలు పడుతున్నది. పెరిగిపోతున్న చమురు ధరలు అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింత సంక్షోభంలోకి నెడుతున్నందున ఈ ధరలను కట్టడి చేయాలని అమెరికా ఒత్తిడి తెస్తున్నది. సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్‌తో సమావేశమైన బ్లింకెన్, ఇరు దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని పెంపొందించుకోవడం, ముఖ్యంగా పరిశుద్ధ ఇంధన రంగం, సాంకేతిక రంగాలపై చర్చించినట్లు అమెరికా విదేశాంగ మంత్రిత్వ శాఖ బయటకు చెబుతోంది. సౌదీ ఉన్నత నాయకత్వంతో బ్లింకెన్ చర్చలు జరిపారు. చమురు ధరలు పెంచేందుకు ఉత్పత్తిని తగ్గించనున్నట్లు ఒపెక్ దేశాలు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే ఇరాన్, సౌదీ అరేబియా మధ్య తంపులు పెట్టి ఈ ప్రాంతంపై ఇ న్నాళ్లు తన ఆధిపత్యం చెలాయించిన అమెరికాకు షాక్ ఇచ్చే పరిణామం ఈ మధ్య చోటు చేసుకుంది. చైనా మధ్య వర్తిత్వంలో ఈ రెండు దేశాలు తమ మధ్య వైరానికి స్వస్తి పలికి ఒక్కటయ్యాయి. దీంతో ఈ ప్రాంతంలో అమెరికాకు గడ్డు పరిస్థితి ఎదురైంది. అమెరికా ప్రాభవం తగ్గిపోయి, చైనా, రష్యా పలుకుబడి అరబ్ దేశాల్లో పెరుగుతున్నది. అంతేకాదు ఇజ్రాయిల్ ఈ ప్రాంతంలో ఒంటరిపాటు కావడం అమెరికాను కలవరపరుస్తోంది. ఈ నేపథ్యంలోనే బ్లింకెన్ సౌదీ నేతలతో జరిపిన చర్చల్లో ఇజ్రాయిల్‌కు సౌదీ సహకారం గురించి బ్లింకెన్ ప్రస్తావించారు.

స్వంత పార్టీ నుండే ట్రంప్‌కు ఎదురు దెబ్బ !
అధ్యక్ష బరిలో దిగిన మాజీ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్

వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌కు స్వంత పార్టీలోనే ఎదురు దెబ్బ తగిలింది. అధ్యక్షుడిగా వున్న సమయంలో ట్రంప్‌కు అత్యంత విశ్వసనీయుడిగా వ్యవహరించిన మాజీ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ 2024 అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. 2021లో అమెరికా కేపిటల్‌పై దాడి తర్వాత మైక్ పెన్స్, తన మాజీ బాస్‌కు వ్యతిరేకంగా మారారు. ఈ దేశానికి మంచి రోజులు తీసుకురావాలన్నది తన కోరిక అని పెన్స్ ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టారు. దానితో పాటు ఎన్నికల ప్రచార వీడియో కూడా పోస్టు చేశారు. ఏ అధ్యక్షుడి కింద పనిచేశారో అ అధ్యక్షుడికి వ్యతిరేకంగా పోటీ చేయడం చాలా అరుదైన విషయం, అమెరికా చరిత్రలోఅతి కొద్ది సార్లు ఇలా జరిగింది. మేలో రిపబ్లికన్ అధ్యక్ష ఎన్నికల ప్రైమరీలో పెన్స్ పాల్గొన్నారు. కేవలం 5శాతం ఓట్లు లభించాయని, ట్రంప్ కన్నా 44 పాయింట్లు వెనుకబడ్డారని మేలో రాయిటర్స్–ఇప్సాస్ ఒపీనియన్ పోల్ పేర్కొంది. అయొవా రాజధాని దెస్ మోయిన్స్‌కి సమీపంలో బుధవారం పొద్దు పోయిన తర్వాత పెన్స్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.

67కోట్ల మందికి విద్యుత్ ఇంకా అందని ద్రాక్షే..

- కాలుష్య ఇంధనాలతో వంట చేస్తున్నవారు 230 కోట్ల మంది
- ఐదు అంతర్జాతీయ సంస్థల నివేదిక వెల్లడి

న్యూయార్క్ : ప్రపంచవ్యాప్తంగా దాదాపు 230కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ వంట చేయడానికి కాలుష్య ఇంధనాలనే వాడుతున్నారని ఐదు అంతర్జాతీయ సంస్థలు బుధవారం విడుదల చేసిన కొత్త నివేదిక తెలిపింది. అలాగే 67.5 కోట్ల మందికి ఇప్పటికీ విద్యుత్ సదుపాయం లేదని పేర్కొంది. ప్రస్తుతమున్న సమాచారం ప్రకారం, విద్యుత్ సౌకర్యం లేనివారు 66కోట్ల మంది వుండగా, పరిశుద్ధమైన వంట చేసుకునే అవకాశాలు 190కోట్ల మందికి లేవని ఆ నివేదిక తెలిపింది. అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఎ), అంతర్జాతీయ పునర్వినియోగ ఇంధన సంస్థ (ఐఆర్‌ఇఎ), ఐక్యరాజ్య సమితి గణాంకాల విభాగం, ప్రపంచ బ్యాంక్, ప్రపంచ ఆరోగ్య సంస్థ కలిసి ఈ నివేదికను రూపొందించాయి. 2030కల్లా ఇంధన లక్ష్యాన్ని చేరుకునే దిశగా ప్రపంచ దేశాలు పయనించడం లేదని నివేదిక పేర్కొంది. ఈ పరిస్థితి, లక్షలాదిమంది ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని, వాతావరణ మార్పులను వేగవంతం చేస్తుందని తెలిపింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడితో తలెత్తిన ఇంధన సంక్షోభం ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని ఐఇఎ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాతి బిరోల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సదుపాయం కలిగిన వారి సంఖ్య 2010లో 84శాతంగా వుండగా, 2021లో ఈ సంఖ్య 91శాతానికి పెరిగిందని నివేదిక పేర్కొంది. అయితే విద్యుత్ లేనివారిలో 80శాతానికి పైగా ప్రజలు అంటే దాదాపు 56.7కోట్ల మంది సబ్ సహారా ఆఫ్రికాలో నివసిస్తున్నారని ఆ నివేదిక తెలిపింది. 2019లో ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, కాలుష్య కారక ఇంధనాలు, సాంకేతికతల నుండి వచ్చే వాయు కాలుష్యంతో ప్రతి ఏటా 32లక్షల మంది అకాల మృత్యువాత పడుతున్నారు.

వివాదాస్పద పదవీ విరమణ చట్టాన్ని నిరసిస్తూ

ఫ్రాన్స్‌వ్యాప్తంగా నిరసనల వెల్లువ

- నిరసన ప్రదర్శనల్లో 5లక్షల మందికి పైగా హాజరు

పారిస్ : పదవీ విరమణ వయస్సును 62 నుండి 64కి పెంచుతూ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ తీసుకువచ్చిన వివాదాస్పద చట్టాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా మళ్ళీ నిరసనలు మొదలయ్యాయి. ఫ్రెంచి యూనియన్ల ఆధ్వర్యంలో మంగళవారం వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. పార్లమెంట్‌లో ఓటింగ్ జరగాల్సిన ప్రక్రియను పక్కకు నెట్టి ఏప్రిల్‌లో మాక్రాన్ ఈ కొత్త చట్టాన్ని వివాదాస్పద రీతిలో ఆమోదించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులను ప్రతిఘటిస్తూ అన్ని ప్రధాన యూనియన్లు తమ ఆందోళనలు కొనసాగిస్తున్నాయి. దేశవ్యాప్తంగా దాదాపు 250 కేంద్రాల్లో 5లక్షల మందికి పైగా ఆందోళనకారులు వీధుల్లోకి వచ్చి తన నిరసన తెలియచేశారు. రాజధాని పారిస్ వీధుల్లో లక్ష మందికి పైగా ప్రదర్శన నిర్వహించారు. పారిస్ ప్రదర్శనలో వామపక్ష యూనియన్ సిజిటి ప్రధాన కార్యదర్శి సోఫీ బినెట్ మాట్లాడుతూ, అంచనాలను తలకిందులు చేసేలా ప్రజా సమీకరణలు వున్నాయని అన్నారు. ఈ నెల 24న చర్చలకు రావాల్సిందిగా నేషనల్ అసెంబ్లీ అధ్యక్షురాలు తనను ఆహ్వానించారని చెప్పారు. అయితే జూన్8లోగానే తాను ఆమెతో సమావేశమై ఈ బిల్లుపై పార్లమెంట్‌లో ఓటింగ్‌కు అనుమతించాల్సిందిగా కోరనున్నట్లు చెప్పారు. ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ఫాబియన్ రౌసెల్ కూడా ఈ పిలుపును సమర్ధించారు. మాంట్‌పెలియర్‌లో జరిగిన బ్రహ్మాండమైన ప్రదర్శనలో రౌసెల్ మాట్లాడుతూ, పార్లమెంట్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాల నుకుంటున్నామని చెప్పారు. నిరసనల కారణంగా కొన్ని విమానాలు, రైళ్ళ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

బ్రిజ్‌భూషణ్‌పై 15 లోగా దర్యాప్తు పూర్తి ప్రభుత్వం హామీ

- పరిష్కరించకుంటే మళ్లీ పోరుబాటే
- తేల్చి చెప్పిన రెజ్లర్లు
- క్రీడాశాఖ మంత్రితో సుదీర్ఘ చర్చలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అపర కీచకుడు, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపి అయిన బ్రిజ్ భూషణ్ సింగ్‌పై ఈ నెల 15 వ తేదీలోగా దర్యాప్తు పూర్తి చేసి, పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసేలా చూస్తామని కేంద్ర ప్రభుత్వం రెజ్లర్లకు హామీ ఇచ్చింది. ఈ నెలాఖరుకల్లా రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి, కొత్త పాలకవర్గాన్ని తీసుకొస్తామని కూడా చెప్పింది. కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూంతో జరిగిన చర్చల్లో పాల్గొన్న బజరంగ్ పునియా, సాక్షి మాలిక్ ఈ విషయాన్ని బుధవార నాడిక్కడ మీడియాకు తెలిపారు. జూన్ 15 వరకు ఆందోళన నిలిపివేయాలన్న మంత్రి అభ్యర్థనను గౌరవిస్తున్నామని వారు చెప్పారు. దీనిపై రైతు సంఘాలను, మద్దతు చ్చిన ఇతర సంఘాలను సంప్రదించి భవిష్యత్ కార్యాచరణపై తగు నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా సానుకూల నిర్ణయం రాకుంటే ఆందోళనను తిరిగి చేపడతామని వారు స్పష్టం చేశారు. క్రీడా మంత్రికి, రెజ్లర్లకు మధ్య బుధవారం ఆరు గంటలపాటు చర్చలు సాగాయి. బ్రిజ్ భూషణ్‌ను, అతని మద్దతు దారులను సమాఖ్యకు దూరంగా ఉంచాలని, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్ష బాధ్యతలు మహిళకు అప్పగించాలని, మహిళా క్రీడాకారులకు భద్రత కల్పించాలని, జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తతల కారణంగా తమపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన ఒక పత్రాన్ని వారు ప్రభుత్వం ముందుంచారు.

శనివారం కేంద్ర హెూం మంత్రి అమిత్‌షాతో జరిపిన చర్చల వివరాలను గోప్యంగా ఉంచాలని తమకు చెప్పిన ప్రభుత్వం, దానికి భిన్నంగా మీడియాకు లీక్ చేయడంపై రెజ్లర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెజ్లర్లు సమ్మె విరమించారని, రైల్వేలో తిరిగి విధులకు చేరారంటూ ప్రభుత్వ అనుకూల మీడియా ప్రచారం చేయడంపై రెజ్లర్లలో నెలకొన్న ఆగ్రహాన్ని చల్లార్చేందుకు బుధవారం కేంద్ర క్రీడల శాఖ మంత్రితో సమావేశం నిర్వహించారు.

క్రీడా మంత్రితో సమావేశానంతరం రెజ్లర్ భజరంగ్ పూనియా మాట్లాడుతూ పలు అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించామని, పోలీసు విచారణ జూన్ 15తో పూర్తవుతుందని, అంతవరకూ ఎలాంటి నిరసన చేపట్టవద్దని మంత్రి కోరారని చెప్పారు. మహిళా రెజ్లర్ల భద్రతను తాము చూసుకుంటామని కూడా హామీ ఇచ్చారని తెలిపారు. తాము సైతం రెజ్లర్లపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లను వెనక్కి తీసుకోవాలని కోరామని, అందుకు మంత్రి అంగీకరించారని చెప్పారు.

డబ్ల్యుఎఫ్‌ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పై రెజ్లర్లు చేసిన ఫిర్యాదులపై దర్యాప్తు ప్రారంభమవడం పట్ల ఎన్‌సిపి అధినేత శరద్ పవార్ సంతప్తి వ్యక్తం చేశారు.

స్వల్ప ఎంఎస్‌పితో రైతులకు ద్రోహం

- ఎఐకెఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్వల్ప ఎంఎస్‌పి ప్రకటించి రైతులకు మోడీ ప్రభుత్వం ద్రోహం చేసిందని ఎఐకెఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా విమర్శించారు. వరికి క్వింటకు సి2ం50 ప్రకారం రూ.2707.5 ప్రకటించాలని, కాని ప్రభుత్వం ఎంఎస్‌పి రూ.2,183 ప్రకటించిందని, దీనివల్ల రైతులకు రూ. 524.5 నష్టమని తెలిపారు. వేరుశెనగకు సి2ం50 ప్రకారం రూ. 7,411.5 ప్రకటించాల్సి ఉందని, కాని ప్రభుత్వం రూ.6,377 ప్రకటించిందని తెలిపారు. దీనివల్ల క్వింటాల్‌కు రైతులు రూ.1,100.5 నష్టపోతున్నారని పేర్కొన్నారు. మొక్కజొన్నకి సి2ం50 ప్రకారం రూ. 2,569.5 ప్రకటించాల్సి ఉండగా, ప్రభుత్వం రూ. 2,090 ప్రకటించిందని, దీనివల్ల రైతులకు క్వింటాల్‌కు 479.5 నష్టం జరుగుతుందని అన్నారు. పత్తికి సి2ం50 ప్రకారం రూ. 8,095.5 ప్రకటించాల్సి ఉందని, కాని ప్రభుత్వం రూ.6,620 ప్రకటించిందని, దీనివల్ల క్వింటాల్‌కు రూ.1,475.5 నష్టం జరుగుతుందని పేర్కొన్నారు.

2022–23 ధర నిర్ణయంలో నీటిపారుదల ఖర్చులు, ఎరువుల ధరలు తదితరాల పెరుగుదలను పరిగణనలోకి తీసుకోలేదని అన్నారు. ఒక సంవత్సరం తర్వాత సి2 ఖర్చులు దీని కంటే చాలా ఎక్కువ అని తెలిపారు. సి2ం50 శాతం కంటే తక్కువ ఎంఎస్‌పిని ప్రకటించి ప్రభుత్వం రైతులకు ద్రోహం చేసిందని, ఇది 2023–24 సీజన్‌లో ఖరీఫ్ పంటల ధరల విధానంపై నివేదికను స్పష్టం చేయలేదని తెలిపారు. గత ఏడాది కాలంలో ముఖ్యంగా ఎరువులు, ఇతర ఇన్‌పుట్‌లతో పాటు నీటిపారుదల ఖర్చులు పెరిగాయని అన్నారు.

ఏడాదికి 200 రోజుల పని, రోజుకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలి

- కేంద్రానికి వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఏడాదికి 200 రోజుల పని, రోజుకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఉపాధి హామీ సమస్యలపై గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శైలేష్ కుమార్ సింగ్‌కి వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు. ప్రతినిధి బృందంలో ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, రాజ్యసభ ఎంపి, సహాయ కార్యదర్శి వి. శివదాసన్, బికెఎంయు సంయుక్త కార్యదర్శి విఎస్ నిర్మల్, ఎఐఎస్ కెఎస్ నుండి అసిత్ గంగూలీ ఉన్నారు. ఉపాధి హామీ సమస్యలపై వివరంగా చర్చించి డిమాండ్లను లేవనెత్తింది. క్షేత్రస్థాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివిధ ఉదాహరణలతో వివరించారు. గ్రామీణ మంత్రిత్వ శాఖ కార్యదర్శితో జరిగిన చర్చ సానుకూల దిశలో జరిగిందని, అవసరమైన స్థాయిలో సమస్యలను చేపట్టేందుకు ప్రతినిధి బృందంకు హామీ ఇచ్చారని బి.వెంకట్ తెలిపారు.

డిమాండ్లు

- ఏడాదికి 200 రోజుల పని, రోజుకు కనీస వేతనం రూ.600 కల్పించాలి.
- కులాల వారీగా నిధుల కేటాయింపు, ఉపాధి హామీ అమలుకు సంబంధించిన సూచనలను ఉపసంహరించుకోవాలి.
- ఎన్ఎంఎంఎస్ తో ఆన్‌లైన్ హాజరును ఉపసంహరించుకోవాలి.
- ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఎబిపిఎస్) నుండి వేతన చెల్లింపును డీలింక్ చేయాలి.
- ఉపాధి హామీ కోసం రూ. 2.56 లక్షల కోట్లు కేటాయించాలి.
- ఉపాధి హామీ డిమాండ్ ఆధారిత పాత్రను నిర్ధారించాలి.
- పెండింగ్‌లో ఉన్న వేతనాలన్నింటినీ వెంటనే చెల్లించాలి.
- సామాజిక తనిఖీతో ఉపాధి హామీ పనుల కింద అవినీతిని తనిఖీ చేయాలి. సామాజిక తనిఖీ కోసం బడ్జెట్‌ను పెంచాలి.
- 60 ఏళ్లు దాటిన ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయం, గ్రామీణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి.
- ఉపాధి హామీ వర్క్ సైట్లలో ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలి.

సిబిఐ విచారణకు 'నో'

- రైల్వే మంత్రి రాజీనామా చేయాల్సిందే
- 12 ప్రతిపక్ష పార్టీల డిమాండ్

భువనేశ్వర్ : ఒడిషా రైలు ప్రమాదంపై సిబిఐ విచారణ జరపడాన్ని 12 ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించాయి. నిస్పాక్షిక విచారణ జరగాలంటే రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణమే రాజీనామా చేయాలని, ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాయి. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జెడి, ఎన్‌సిపి, ఆర్‌పిఐ, ఆప్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్, ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్, సమతా క్రాంతిదళ్ పార్టీల ఒడిశా రాష్ట్ర శాఖలు సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించాయి. సిబిఐ విచారణను తాము తిరస్కరిస్తున్నామని ఆ పార్టీలు స్పష్టం చేశాయి. కేంద్ర దర్యాప్తు సంస్థ బిజెపి ఆదేశానుసారం నడుచుకుంటుందని అవి విమర్శించాయి. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలని, కోర్టు పర్యవేక్షణలోనే విచారణ జరగాలని డిమాండ్ చేశాయి. అయితే ఒడిశాలోని అధికార బిజెడి మాత్రం సిబిఐ దర్యాప్తును స్వాగతించింది. రైలు ప్రమాదం వెనుక ఉన్న అసలైన దోషిని పట్టుకుని శిక్షిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.

రైల్వే మంత్రిత్వ శాఖ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని, దీనికి బాధ్యత వహించి మంత్రి వైష్ణవ్ రాజీనామా చేయాలని ఒడిశా పిసిసి అధ్యక్షులు శరత్ పట్నాయక్ విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ ప్రమాదానికి రైల్వే మంత్రితో పాటు ప్రధాని మోడీ కూడా బాధ్యత వహించాలని అన్నారు. రైల్వేలో రక్షణ చర్యలు తీసుకోవాల్సిన మోడీ ప్రభుత్వం వాటిని గాలికి వదిలి ప్రచార ఆర్భాటాలకు పరిమితమైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైలు ప్రమాదంపై మంత్రి వైష్ణవ్ పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నారని తెలిపారు. సంఘటనకు బాధ్యులను గుర్తించామని ఉదయం చెప్పారని, సాయంత్రానికే మాట మార్చి సిబిఐ విచారణ జరుపుతుందంటూ కొత్త పల్లవి అందుకున్నారని అన్నారు. ప్రజలను తప్పుదోవపట్టించే ప్రకటనలు ఆమోదయోగ్యం కావని అంటూ మృతుల కుటుంబ సభ్యులలో కనీసం ఒక్కొక్కరికైనా ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా తన మంత్రిత్వ శాఖను నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నందుకు వైష్ణవ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత బినయ్ పట్నాయక్ డిమాండ్ చేశారు.



నవ్వుకుందాం!

టీచర్ : ఒరేయ్ బన్నీ... రాత్రంతా సెల్ ఛార్జింగ్ పెట్టేసి గేమ్స్ ఆడుతున్నావట? బ్యాటరీ పేలిపోతుంది జాగ్రత్త.

బన్ని : ఈ రోజు అలా చేయను టీచర్. బ్యాటరీ తీసేసి ఛార్జింగ్ పెడతా.

టీచర్: ఆ....

- అభినవ్,
1వ తరగతి,
అరవింద స్కూలు,
కుంచనపల్లి, గుంటూరు జిల్లా.

బొమ్మలు గీస్తా - బహుమతి సాధిస్తా

నా పేరు రిహాన్ అహ్మద్. మా అమ్మా, నాన్నల పేర్లు రెహానా, అసేన్. నేను మర్తాడు ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నా. చదువుతో పాటు ఆటలు ఆడడం ఇష్టం. బొమ్మలు గీయడమంటే మరీ ఇష్టం. ఈ మధ్యకాలంలో ఆన్‌లైన్ ద్వారా జరిగిన పోటీల్లో పాల్గొన్నా. ఫస్ట్‌టైం మంచి బహుమతి వచ్చింది. ఇదివరకూ నేను నాలుగైదు పోటీల్లో పాల్గొన్నా బహుమతి రాలేదు. అయినా నేను నిరుత్సాహ పడలేదు. పోటీ పాల్గొనడమే గొప్ప విషయం అని మా అమ్మా, నాన్న చెబుతుండేవారు. స్కూల్లో ఉపాధ్యాయులు కూడా ఎంతో మెచ్చుకున్నారు. జాతీయ స్థాయిలో జరిగిన పోటీలో మంచి బహుమతి రావడం ఎంతో ఆనందంగా ఉంది. మా వెంకటరమణ సార్ మాకు చదువుతో పాటు బొమ్మలు గీయడం కూడా నేర్పుతారు. మా పాఠశాల్లో జరిగిన అభినందన సభలో మా మండల విద్యాధికారి శ్రీ తారాచంద్రా నాయక్ సార్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నా. మా అమ్మ, నాన్న ఎంతో సంతోషించారు. నా స్నేహితులు అభినందించారు.

- రిహాన్ అహ్మద్,
4వతరగతి,
ఎంపిపి పాఠశాల,మర్తాడు మెయిన్,
గార్లదిన్న, అనంతపురం.

ఫ్యాషన్

- ఎం. సాయి గీతాన్ష్,
యు.కె.జి,
ఉదయగిరి,
నెల్లూరు జిల్లా.

మోడరన్ సరస్వతి
- జనహిత రెడ్డి,
ఎర్రగుంట్ల,
కడప జిల్లా.

బొమ్మరిల్లు



- అరగల జెఫన్యా,
1వ తరగతి,
సెయింట్ పాల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూలు,
కోవూరు,
నెల్లూరు జిల్లా.

- వెన్నెల,
6 తరగతి,
గుడ్ న్యూస్ ఇంగ్లీష్ మీడియం స్కూలు,
ఏలూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

JEEVANA జీవన the family

సముద్రాన్ని చూసి ఆనందంతో కేరింతలు కొట్టేవాళ్లు చాలామందే ఉంటారు. అలలతో చెలిమి చేస్తూ రోజంతా అక్కడే గడిపేవాళ్లూ కనపడతారు. అయితే 'సముద్రాన్నే ఇల్లుగా చేసుకుని అక్కడే.. అందులోనే జీవిస్తున్నాను' అంటూ సముద్రంపై సముద్రమంత ప్రేమను పెంచుకున్నారు గోవాకు చెందిన కాట్యా కోయిల్హో. ఆమె ప్రేమకు సముద్రమే దాసోహమైంది. తనపై ఊయలాడిస్తూ ఎన్నో ఊసులు చెబుతోంది. వారిద్దరి స్నేహానికి చిహ్నంగా త్వరలో భారత్‌లోనే ఏకైక మహిళా విండ్ ఫాయిలర్‌గా ఆమె చరిత్ర సృష్టించనున్నారు.

ఈ ప్రయాణంలో ఆమెదే మొదటిస్థానం..

భారత మొట్టమొదటి విండ్ సర్ఫర్‌గా కోయిల్హో 2014లో తొలిసారి యూత్ ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు. దేశం తరపున పోటీపడిన ఏకైక, మొదటి సర్ఫర్ ఆమె. ఇప్పుడు మళ్లీ ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే ఏషియన్ గేమ్స్‌లో విండ్ ఫాయిలర్‌గా పాల్గొనేందుకు సన్నద్ధమవుతోంది. 2024లో జరగబోయే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత గేమ్‌గా దీన్ని పరిగణిస్తారు.

బాల్యంలోనే..

కోయిల్హో తండ్రి సర్ఫింగ్‌లో దిట్ట. మూడుసార్లు జాతీయ బహుమతులు అందుకున్నారు. ఆమె అన్న కూడా విండ్ సర్ఫరే. తండ్రిని, అన్నను చిన్నప్పటి నుండి చూస్తూ పెరిగిన కోయిల్హో చిన్నతనం నుండే సర్ఫింగ్‌పై మక్కువ పెంచుకున్నారు. 11 ఏళ్లప్పుడు ఒకరోజు తండ్రితో పాటు సముద్రాన్ని చూసేందుకు వెళ్లింది. నీలి రంగులో ఎగిసిపడుతున్న అలలతో ఉన్న సముద్రాన్ని చూసి కేరింతలు కొట్టింది. తండ్రి ప్రాక్టీసును నిశితంగా గమనించింది. 'అలలపై నాన్న వేగంగా ప్రయాణించడం చూసి నా కళ్లు ఆశ్చర్యంతో మెరిశాయి. నేను కూడా సర్ఫింగ్ చేస్తానని మొండికేశాను. నా ఉత్సాహం చూసిన నాన్న సర్ఫింగ్ చేసేందుకు ప్రోత్సహించాడు. అయితే తొలిసారి పోల్‌పై నుంచొన్నప్పుడు చాలా భయమేసింది. కెరటాల గాలికి పడిపోతానేమోనని ఊగిపోతున్న బోర్డును గట్టిగా పట్టుకున్నాను. అయినా నా కాళ్లు చేతులు భయంతో వణికిపోయాయి. నరాలు బిగుసుకుపోయాయి. నాన్న ఇచ్చిన ధైర్యంతో ఆ రోజు సర్ఫింగ్ చేశాను. అది మొదలు రోజూ నాన్నతో సర్ఫింగ్‌కు వెళ్లేదాన్ని. గాలితో పోరాడడం నేర్చుకున్నాను. వణుకు తగ్గించుకుని బలంగా నిలబడడం ప్రాక్టీస్ చేశాను. అలలను బ్యాలెన్స్ చేసుకుంటూ బోర్డుపై ప్రయాణించడం మొదలుపెట్టాక ఇక ఆపలేదు' అంటూ తన మొదటి అనుభవాన్ని పంచుకున్నారు ఆమె. ఇంకా ఆమె ఇలా చెబుతున్నారు.. 'ఆ సమయంలో నేను, సముద్రం ఒక్కటే అన్నట్లుగా భావించాను. ఆ అనుభవం నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనిది' అంటున్నారు.

ఇప్పటికీ ఆమే..

'సర్ఫర్‌గా ప్రస్థానం మొదలుపెట్టి ఇప్పటికి 12 ఏళ్లు గడుస్తోంది. అయినా ఏ ఒక్క మహిళా ఈ రంగంలోకి అడుగుపెట్టలేదు. అందుకే నా ప్రయాణాన్ని చూసైనా నేను సాధించిన విజయాలను వినైనా నాతో పాటు మరింతమంది మహిళలు ఇటువైపు వస్తారని ఆశపడుతున్నాను' అంటున్న కోయిల్హో 2014 యూత్ ఒలింపిక్స్ తరువాత 2018లో ఏషియన్ గేమ్స్‌లో, 2022లో థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ విండ్ సర్ఫింగ్ కప్‌లో పాల్గొన్నారు. ప్రస్తుతం ఈ ఏడాది సెప్టెంబరు 23 నుండి అక్టోబరు 8 మధ్య జరగబోయే ఏషియన్ గేమ్స్‌కు సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు పాల్గొన్న ఆర్‌ఎస్ : ఎక్స్ కేటగిరీకి బదులుగా విండ్‌సర్ఫింగ్ క్లాస్ అయిన విండ్ ఫాయిలింగ్ విభాగంలో తొలిసారి పోటీపడుతున్నారు. ఒలింపిక్ కమిటీచే గుర్తింపుపొందిన ఈ విభాగాన్ని ప్రపంచ సైలింగ్ కమిటీ మొట్టమొదటిసారిగా పరిచయం చేస్తోంది.

ఏ రెండు రోజులూ ఒకేలా ఉండవు..

'హాబీగా మొదలైన నా ప్రయాణం ఇప్పుడు ప్రొఫెషన్‌గా మారింది. ఇది నేను ఊహించలేదు. ఈ ఆట చాలా శక్తివంతమైనది. కెరటాలపై పట్టు సాధిస్తూ చేతులు, కాళ్లతో బోర్డు దిశ మార్చుకుంటూ వేగంగా ప్రయాణించడం అంత సులభం కాదు. ఆటలో నైపుణ్యం ఒక్కటే సరిపోదు.. పరికరాలను ఉపయోగించడంలో కూడా నైపుణ్యం సాధించాలి. సముద్రంపై ఏ రెండు రోజులూ ఒకేలా ఉండవు. సర్ఫింగ్ చేసేటప్పుడు ఈ విషయం కచ్చితంగా గుర్తుంచుకోవాలి. 2018లో సర్ఫింగ్ చేసేటప్పుడు నా బోర్డు నుండి ఓ యూనివర్సల్ భాగం విరిగిపడిపోయింది. ఊహించని ఈ పరిణామంతో ఒక్కసారిగా నేను కిందకు పడిపోయాను. ఆ ప్రమాదంలో నా రెండు మోకాళ్లకు దెబ్బ తగిలింది. చాలా విరామం తరువాత మళ్లీ సర్ఫింగ్ చేయడం ప్రారంభించాను' అంటున్న కోయిల్హో ఈ ప్రయాణంలో మహిళల భాగస్వామ్యం లేకపోవడం వల్ల చాలాసార్లు పురుషుల విభాగంలోనే పోటీపడ్డారు. ఈసారి జరగబోయే ఏషియన్ గేమ్స్ నుండైనా మహిళలు ఈ రంగంలోకి రావాలని ఆశిస్తున్నారు.

పాత్రల మధ్య ఘర్షణే 'టక్కర్'

'**ఇ**ద్దరు వ్యక్తుల మధ్య జరిగే ఘర్షణ చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది. ఈ చిత్రంలో హీరో-హీరోయిన్ మధ్య ఘర్షణ, హీరో-విలన్ మధ్య ఘర్షణ, అహం, లింగం, వయస్సు, డబ్బు ... ఇలా అనేక ఘర్షణలు ఉంటాయి. హీరో హీరోయిన్ల మధ్య రిలేషన్ షిప్‌లో చాలా షేడ్స్ ఉంటాయి. డబ్బు సంపాదించాలనే కోరికతో, హీరోని కిడ్నాపర్‌గా మారేలా పరిస్థితులు ప్రభావితం చేస్తాయి. నిరాశ అతని లక్ష్యాలను నిర్దాక్షిణ్యంగా కొనసాగించేలా చేస్తుంది. కొడుకు, తల్లి మధ్య సాగే కీలకమైన డైలాగ్ సినిమా సారాంశాన్ని తెలుపుతుంది. హీరో నగరానికి రాగానే దిగజారిపోతున్న పరిస్థితులను చూస్తాడు. పాత్ర తీరు, పరిస్థితుల కారణంగా గూండాలతో పోరాడతాడు' అంటూ సిద్ధార్థ్ తాను నటించిన 'టక్కర్' సినిమా విశేషాలు తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఇంకా ఆయన మాట్లాడుతూ 'ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రాన్ని రూపొందించాలనేది నా కల. దానికోసం నాకు తగిన స్వేచ్ఛ కావాలి. తమిళ్‌లో నేను ఐదు సినిమాలు నిర్మించాను, కానీ నా అత్యంత ముఖ్యమైన ప్రాజెక్ట్ ఇంకా రాలేదు. దీనికి 'చిన్నా' అనే టైటిల్ పెట్టాం. ఇది నా స్వంత బ్యానర్‌లో నిర్మించబడుతుంది. ఈ సినిమా ఎన్నో అవార్డులు, ప్రశంసలు అందుకుంటుందని నమ్ముతున్నాను' అంటూ తన భవిష్యత్తు ప్రాజెక్టు విశేషాలు పంచుకున్నారు. రాయడం నాకు నిరంతర ప్రక్రియ. నేను ఇప్పటికే 'గృహం' సీక్వెల్‌ని సిద్ధం చేసాను. ఇంకా చాలా ప్రాజెక్ట్‌లు లైన్‌లో ఉన్నాయి. మా ప్రొడక్షన్‌లో మేము కొత్త రచయితలను ప్రోత్సహిస్తాము. నటుడిగా, గాయకుడిగా, నిర్మాతగా, రచయితగా, భవిష్యత్ దర్శకుడిగా, నేను విభిన్న మార్గాలను అన్వేషించడానికి, కొత్త సవాళ్లను స్వీకరించడానికి ప్రయత్నిస్తాను' అంటున్నారు. 'టక్కర్' చిత్రం జూన్ 9న తెలుగు, తమిళ భాషల్లో భారీస్థాయిలో విడుదల కానుంది.



ఈరోజే టైటిల్ ప్రకటన

బాలకృష్ణ హీరోగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'ఎన్‌బికె-108' చిత్రం నుండి తాజా అప్డేట్ ఒకటి బయటికి వచ్చిందిపీ చిత్ర టైటిల్‌ని 108 ప్రాంతాల్లో 108 భారీ హోర్డింగ్స్‌తో గురువారం లాంచ్ చేస్తున్నట్టుగా మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో కాజల్ హీరోయిన్ గా శ్రీ లీల ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్ సినిమాస్ నిర్మాణం వహిస్తున్నారు. దసరా కనుకగా ఈ చిత్రం రిలీజ్ కానుంది.

'జిఎ-2' పిక్చర్స్ కొత్త చిత్రం పోస్టర్ విడుదల

గీత ఆర్ట్స్ అనుబంధ సంస్థ 'జిఎ-2' పిక్చర్స్ బ్యానర్ నుండి కొత్త సినిమా రాబోతోంది. 'భలే భలే మగాడివోయ్', 'ప్రతి రోజూ పండగే', 'మహానుభావుడు' లాంటి చిత్రాలను అందించిన ఈ సంస్థ నుండి తేజ మర్ని దర్శకత్వంలో బన్నీ వాసు నిర్మాణంలో ప్రొడక్షన్ నెంబర్ 8 చిత్రం ప్రారంభించారు. అల్లు అరవింద్ సమర్పణలో ప్రేక్షకుల ముందుకి ఈ చిత్రం రానుంది. శ్రీకాంత్, వరలక్ష్మి శరత్ కుమార్, రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్, మురళీ శర్మ, బెనర్జీ, పవన్ తేజ్ కొణిదెల ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. బుధవారం రాహుల్ విజయ్ పుట్టినరోజు సందర్భంగా చిత్రం యూనిట్ ఒక పోస్టర్‌ని విడుదల చేసింది. మరిన్ని వివరాలు త్వరలో వెలువడనున్నాయి.

ఓటీటీలో 'కస్టడీ'



నాగ చైతన్య ప్రధాన పాత్రలో వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కిన 'కస్టడీ' చిత్రం అమెజాన్ ప్రైమ్‌లో జూన్ 9న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తెలుగు, తమిళ్ బైలింగువల్ మూవీగా రూపొందిన ఈ చిత్రంలో కానిస్టేబుల్ శివగా అండర్ డాగ్ పాత్రలో నాగ చైతన్య నటించారు. కృతి శెట్టి హీరోయిన్‌గా చేశారు. అరవింద్‌స్వామి, శరత్‌కుమార్ కీలకపాత్రల్లో కనిపించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై నిర్మాత శ్రీనివాస చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మించారు.

సస్పెన్స్ థ్రిల్లర్‌గా '7:11పిఎం' టీజర్ విడుదల

చైతు మాదాల దర్శకుడిగా పరిచయమవుతున్న సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ '7:11పిఎం'. సాహస్, దీపికా నటించిన ఈ చిత్రం నుండి గోపీచంద్ మలినేని టీజర్ లాంచ్ చేశారు. ఈ సినిమాలోని ప్రధాన పాత్రలు, నేపథ్యాన్ని పరిచయం చేశారు. ఏలియన్ ప్లానెట్ నుంచి మానవులు : ప్రాక్సిమా 'ఇవి-12', 400 సంవత్సరాలలో భవిష్యత్తులో మానవుల మనుగడకు కీలకమైన సమాధానాల కోసం 'హంసలదీవి' అనే చిన్న ఇండియన్ టౌన్‌కి చేరుకుంటారు. అదే రోజున, టౌన్‌ని నాశనం చేయడానికి కొన్ని కుట్రలు జరుగుతుంటాయి. హీరో తన చేతిలోని టైమర్‌ను 7:11పిఎం లోపు డీయాక్టివేట్ చేయాలి అంటే గడువు కంటే ముందే అతను మిస్టరీని ఛేదించాలి. లేదంటే కార్డియాక్ అరెస్ట్ ద్వారా అతని గుండె ఆగిపోతుంది అనే అంశాలు టీజర్‌లో చూపించారు. ఆర్కస్ ఫిల్మ్ప్ పతాకంపై నరేన్ యనమదల, మాధురి రావిపాటి, వాణి కన్నెగంటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి జ్ఞాని సంగీతం అందించారు. త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నారు.

ఆసియా కప్‌కు పాక్ దూరం?

ఆసియా కప్ నుంచి పాకిస్థాన్ వైదొలగనున్నట్లు తెలుస్తోంది. తాము ప్రతిపాదించిన హైబ్రిడ్ విధానాన్ని శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్తాన్ వ్యతిరేకించడంతో ఆసియా కప్‌కు దూరంగా ఉండే విషయంలో పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మల్లగుల్లాలు పడుతోంది.

కరాచి: ఆసియా కప్ నుంచి పాకిస్థాన్ వైదొలగనున్నట్లు తెలుస్తోంది. తాము ప్రతిపాదించిన హైబ్రిడ్ విధానాన్ని శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్తాన్ వ్యతిరేకించడంతో ఆసియా కప్‌కు దూరంగా ఉండే విషయంలో పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మల్లగుల్లాలు పడుతోంది. ఈ ఏడాది సెప్టెంబరులో ఆసియా కప్‌కు పాక్ ఆతిథ్యమివ్వాల్సింది. భద్రత కారణాల వల్ల పాక్‌లో పర్యటించేందుకు భారత్ నిరాకరించింది. దీంతో టీమ్ఇండియా మ్యాచ్‌ల్ని తటస్థ వేదికలో నిర్వహించేలా హైబ్రిడ్ విధానాన్ని పీసీబీ ప్రతిపాదించింది. కానీ.. టోర్నీని పాక్ నుంచి తరలించాలన్న బిసిసిఐ ఆలోచనకే శ్రీలంక, బంగ్లా, అఫ్ఘాన్‌లు మద్దతు తెలపడంతో పీసీబీ ఆశలు గల్లంతయ్యాయి. "పాక్ ముందు రెండే దారులు ఉన్నాయి. తటస్థ వేదికలో ఆడటం లేదా టోర్నీ నుంచి వైదొలగడం" అని ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) వర్గాలు తెలిపాయి.

'లక్ష్య' హిమతేజకు కాంస్యం

'లక్ష్య' క్రీడాకారుడు వల్లిపి హిమతేజ (ఆంధ్రప్రదేశ్) అంతర్జాతీయ వేదికపై సత్తాచాటాడు. ఆసియా జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో మెరిశాడు.

ఇంచియాన్ (కొరియా) : ఈనాడు సీఎస్‌ఆర్ కార్యక్రమం 'లక్ష్య' క్రీడాకారుడు వల్లిపి హిమతేజ (ఆంధ్రప్రదేశ్) అంతర్జాతీయ వేదికపై సత్తాచాటాడు. ఆసియా జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో మెరిశాడు. మంగళవారం అండర్-20 పురుషుల 4x100 మీటర్ల రిలే రేసును హిమతేజ, అరిజిత్ రానా, మహ్మద్ రియాన్ బాషా, దొండపాటి మత్యుంజయ రామ్‌లతో కూడిన భారత జట్టు 40.56 సెకన్లలో పూర్తిచేసి మూడో స్థానంలో నిలిచింది. జపాన్ (39.76 సె) ప్రథమ, కొరియా (40.32 సె) ద్వితీయ స్థానాలు సాధించాయి. హైదరాబాద్‌లోని 'లక్ష్య' గోపీచంద్ హై పర్ఫార్మెన్స్ సెంటర్‌లో ద్రోణాచార్య నాగపురి రమేశ్ ఆధ్వర్యంలో హిమతేజ శిక్షణ తీసుకుంటున్నాడు. మరోవైపు మహిళల 4x100 మీటర్ల పరుగులోనూ భారత్‌కు కాంస్య పతకం లభించింది. తమన్నా, అక్షయ, నయన, అభినయలతో కూడిన భారత బందం 45.36 సెకన్లలో రేసును ముగించి మూడో స్థానం సాధించింది. చైనా (45.05 సె) ప్రథమ, థాయ్‌లాండ్ (45.34 సె) ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2023
ఎంట్రీలకు ఆహ్వానం

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు కావస్తున్నది. కోవిడ్ మహమ్మారి కారణంగా 2020, 2021 సంవత్సరాల్లో మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2023 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ సంపాదకులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావులతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం **ఏదేని ప్రజా సమస్యపై రాసిన క్షేత్ర స్థాయి వార్తా కథనాలను, ఫీచర్స్‌ను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2022 మే 1నుంచి 2023 ఏప్రిల్ 30లోపు తెలుగు దిన పత్రికల్లో, స్పెషల్స్‌లో ప్రచురితమైన వార్తా కథనాలు, ఫీచర్స్ మాత్రమే పంపాలి.** ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం ఒకటి జతచేసి పంపాలి. తమకు నచ్చిన మంచి సమస్యాత్మక కథనాన్ని ఇతరులైనా పంపవచ్చు. అచ్చుయిన తేదీ, ఎడిషన్ వివరాలు జత చేయాలి. ఒక్కొక్కరు ఒకటి లేదా రెండు వార్తాకథనాలను మాత్రమే పంపాలి. ఎంట్రీలు 2023 జూన్ 10 కల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2023 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2023 జూన్ మూడవ వారంలో పుట్టపర్తిలో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ. 10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎం వి ఎస్ శర్మ, కార్యదర్శి,
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా : **కార్యదర్శి , ప్రజాశక్తి సాహితీ సంస్థ,** ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా, పిన్: 522501. ఇ-మెయిల్ అడ్రస్: **psmhaward@gmail.com**

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68